



'బ్యాంకు' రాజకీయం

» కూటమి మద్దతుతో తెరమీదకు ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు
» శ్రీఘాకోళ్లపు ఇంటిలో వైసీపీ నేతల మంతనాలు
» నేడు నామినేషన్ల స్వీకరణ

రాజమహేంద్రవరం, జూలై10(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం అర్బన్‌బ్యాంక్ చైర్మన్ అభ్యర్థిగా మాజీ చైర్మన్ చల్లాశంకరరావు పేరు వినిపిస్తోంది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మద్దతుతో ఆయన తెరమీదకు వచ్చారు. మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉంటారు. ఓటర్లు డైరెక్టర్లను ఎన్నుకుంటే, డైరెక్టర్లు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. టీడీపీ మద్దతుతో ఎక్కువమంది డైరెక్టర్లు పోటీపడుతున్నారు. జనసేన మద్దతుదారు ఒకరు, బీజేపీ మద్దతుదారు ఒకరు ఉన్నారు. సుమారుగా పేర్లు ఖరారైనట్టు సమాచారం. రాజమహేంద్రవరంలోని చల్లా రెసిడెన్స్‌లో బుధవారం రాత్రి చల్లా శంకరరావు ప్యానల్ సభ్యులంతా సమావేశమయ్యారు. అటు వైసీపీ మద్దతుదార్లలో అయోమయం నెలకొంది. అర్బన్‌బ్యాంక్ విషయంలో పట్టున్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యంతో ఆయన ఇంట్లో బుధవారం మధ్యాహ్నం వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, చాంబర్ మాజీ ప్రెసిడెంట్ నందెపు శ్రీనివాస్ తదితరులు సమావేశమయ్యారు. పార్టీ ప్రమేయం లేకుండా కొందరిని పోటీ పెట్టేటట్టు ఆలోచించినట్టు సమాచారం. ఇక్కడ కూడా వైసీపీలో విభేదాలు కనిపించాయి. మాజీ ఎంపీ మార్గాని భరత్ వీరికి దూరంగా ఉండడం గమనార్హం. కానీ పార్టీ ప్రమేయం లేకుండా ఒక ప్యానల్‌ను పోటీలో పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. సభ్యుల కోసం వెతుకుతున్నారు. లంకా సత్యనారాయణతోపాటు కొందరు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. వైసీపీ మద్దతుదారులుకానీ, స్వతంత్ర అభ్యర్థులుకానీ పోటీలో లేకపోతే చల్లా ప్యానల్ ఏకగ్రీవం అవుతుంది. ఎవరైనా పోటీలో ఉంటే ఎన్నికలు జరుగుతాయి. ఉభయగోదావరి జిల్లాలు, విశాఖ, గుంటూరు జిల్లాల్లో 16 బ్రాంచిలు ఉన్నా ఈ బ్యాంక్ ఎన్నికల్లో 78,423 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కూటమి ప్యానల్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు, ఆయన ప్యానల్‌లో బీజేపీ తరపున యెనుమల రంగబాబు, జనసేన తరపున కప్పల సూర్యప్రకాష్, టీడీపీ మద్దతుతో పోలాకి పరమేష్, పిల్లి శ్యామ్, ఎర్రమోతు ధర్మరాజు, కాకినాడ నుంచి సింగంపల్లి రామకృష్ణ, దివాన్‌చెరువు నుంచి నీలపాల సూర్యసత్యనారాయణ, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాస్, పడాల శ్రీను, బుడ్డిగ రవి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కాగా అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్లు స్వీకరించనున్నట్టు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారి దాఖలైన నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. 12తేదీ ఉదయం 11గంటల నుంచి నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. తుది జాబితా ప్రకటిస్తారు. 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. 22న పాలకవర్గం కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటుంది.

హద్దు మీరితే జైలుకే



» సోషల్ మీడియాలో మితిమీరి కామెంట్లు, ట్రోలింగ్స్
» పోస్టులు పెట్టే ముందు.. కామెంట్, షేర్ చేసే సమయంలో బాధ్యతాయుతంగా ఉండాల్సిందే
» అదుపు తప్పితే కటకటాలే.. ఈ పోకడలపై జనంలోనూ విస్తృత చర్చ
» యువత తప్పు చేస్తే వారి భవిష్యత్తూ అంధకారమే.. కుటుంబమూ అల్లరి పాలు

స్మార్ట్‌ఫోన్.. ఆధునిక మనిషిలో ఆ మనిషికే తెలియకుండా ఓ అంగమైపోయింది. ఒంటిపై సరైన బట్టలు లేకపోయినా చేతిలో స్మార్ట్‌ఫోన్ మాత్రం ఉండాల్సిందే. చేతి వేళ్లు దాన్ని గీకుతూ ఉండాల్సిందే. లైక్, కామెంట్, షేర్ అనేది ఓ కొత్త జీవితం.. ట్రోలింగ్ వంటి పదాలూ పుట్టుకొచ్చాయి. ఈ మాయా ప్రపంచంలో సముద్రమంత మంచి ఉంటే ఆకాశమంత చెడు ఉందని పెద్దల గగ్గోలు మామూలే. చేతిలో ఇమిడిపోయే ఆ ఎలక్ట్రానిక్ ఉపకరణంలో సోషల్ మీడియా.. అదో ఎల్లలు లేని ప్రపంచం. ఎన్నో వీడియోలు.. మరెన్నో ఫొటోలు.. అంతులేని సమాచారం.. అవధుల్లేని పరిజ్ఞానం.. అంతే అంతుచిక్కని కంటెంట్. ప్రతి సెకనుకూ పది మంది చేరుతున్న ఓ లోకం. అన్నం లేకపోయినా చేతికి వేలు ఉంటే చాలు అనేంత దారుణమైన పరిస్థితి దాపురించింది.

బాధ్యతగా మెలగాలి: ఎస్పీ జగదీశ్

సోషల్ మీడియాలో బాధ్యతగా మెలగాలి. జీవితాల మెరుగుదలకు ఉపయోగపడేవిధంగా వినియోగించుకోవాలి. అసభ్యకర, అభ్యంతర, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా.. అలాంటి వాటిని లైక్, షేర్ చేయడం.. ట్రోలింగులు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు. వీటికి సంబంధించి ప్రజల వద్ద సమాచారం ఉంటే వెంటనే 9440796577 నెంబరుకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలి. అవసరమైతే అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. ఇది సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలి. ఇప్పటికే సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై నిరంతర నిఘా పెట్టాం. కఠిన చర్యలూ తీసుకుంటాం.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ట్విటర్(ఎక్స్), ఫేస్‌బుక్, యూట్యూబ్, టెలిగ్రాం, వాట్సాప్, ఇన్‌స్టా.. ఇలా చెప్పుకుంటేపోతే ఎన్నో వేదికలు. ఆ వేదికలపై మనిషి బుర్రలోని ఆలోచనలు ఓ చిత్ర రూపంలో తాండవిస్తుంటాయి. వాటికి కొంత ఆదాయమూ వస్తుంటుంది. అందుకే ఈమధ్య కాలక్షేపంకంటే డబ్బులు సంపాదనకూ సోషల్ మీడియాను ఎక్కువగా వాడేస్తున్నారు. అయితే.. స్మార్ట్‌ఫోనూ మనదే.. వేలూ మనదే అని బాధ్యత, నిబంధనలు మరిచి ప్రవర్తించే వాళ్ల కోసం కటకటాలు ఎదురు చూస్తుంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నిజమే.. సమాచారాన్ని, సృజనాత్మకతను, నైపుణ్యాలను పంచుకోవాల్సిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వికృత చేష్టలు.. విపరీత పోకడలు ఎక్కువైపోయాయి. ఇవి కొందరి మనోభావాలను దెబ్బతీస్తుంటే.. మరికొందరు సున్నిత మనస్కులు కుంగిపోతున్నారు.. ప్రాణాలు తీసుకున్నవాళ్లూ ఉన్నారు. సోషల్ మీడియాతో ప్రయోజనాలు ఎన్నో ఉన్నా ప్రమాదాలు కూడా తక్కువేమీ కాదని రుజువవుతూనే ఉంది. దీంతో సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై చట్టం దృష్టి సారించింది. మా ఇష్టం అంటూ రెచ్చిపోతున్న వాళ్లను జైలుకు పంపుతోంది. ఏమైనా సోషల్ మీడియా వాడేప్పుడు కాస్త ఒళ్లు దగ్గర పెట్టుకోకపోతే చిక్కుల్లో పడినట్టే.

● విపరీత పోకడలు

ఈమధ్య సోషల్ మీడియాలో విపరీతమైన పోకడలు కనిపిస్తున్నాయి. ఇష్టానుసారం పోస్టులు.. విచ్చలవిడిగా కామెంట్లు పెడుతున్నారు. ఇటీవల ప్రణీత్ హనుమంతు అనే యూట్యూబర్ తండ్రీకూతుళ్లపై పెట్టిన కామెంట్.. మానవ జాతికే అవమానంగా మిగిలిపోయింది. తీరా చూస్తే అతడు ఓ సీనియర్ ఐఏఎస్ కొడుకు. ఇతనేకాదు ఎంతోమంది సోషల్ మీడియాను అత్యంత హేయంగా వినియోగిస్తున్నారు. వీరిలో బాగా చదువుకున్న వాళ్లూ అధికంగా ఉండడంపై సభ్యసమాజం ఆందోళన వ్యక్తంచేస్తోంది. సోషల్ మీడియాను మానవ మనుగడను మెరుగుపరుచుకోడానికి, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వేదికలుగా చూడకుండా.. తమ వికృత చేష్టలకు ప్లాట్‌ఫాంలుగా భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు, కామెంట్ పెడితే దానికంటే చాటింపే మేలు అనిపిస్తుంది. ఎక్కడెక్కడికో అది వెళ్లిపోతుంది. ఫోన్లలో డౌన్‌లోడ్ కూడా అయిపోతోంది. దీంతో కామెంట్ పెట్టిన వారి మాటెలా ఉన్నా.. బాధితులు మాత్రం అల్లాడిపోతున్నారు.

● కచ్చితంగా పట్టేస్తారు

సోషల్ మీడియా అనేది ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన కమ్యూనికేషన్ మార్గం. ప్రపంచవ్యాప్తంగా 5 బిలియన్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇది ప్రపంచ జనాభాలో 62 శాతం. రోజు రోజుకూ ఆ సంఖ్య వేలల్లో పెరుగుతూనే ఉంది. దానితోబాటే అత్యంత హానికరమైన ప్రతికూలతలు కూడా పెరుగుతూ పోతున్నాయి. సోషల్ మీడియా వాడకం విపరీతమైన తర్వాత సామాజిక, భావోద్వేగ, మానవ సంబంధాలు.. కుటుంబ బంధాలు పలుచబడిపోయాయి. బుర్రలో పదును తగ్గిపోతోంది. అందరూ ఉన్నా ఒంటరివాళ్లు ఎక్కువైపోతున్నారు. పుస్తకాలు చదవడం ఎప్పుడో మానేశారు. చేతిలో పుస్తకం మాయమైపోయింది. ఏదో తెలియని గజిబిజి, గందరగోళం మెదడును కమ్మేస్తోంది. ఒక కుటుంబంలో నలుగురు ఉంటే సోషల్ మీడియలో విహరించడానికి ఇచ్చిన సమయంలో సగం కూడా ఒకరితో ఒకరు మాట్లాడుకోడానికి ఇవ్వడం లేదు. బస్సుల్లో, రైళ్లలో, విమానాల్లో పక్కపక్కన కూర్చున్న వారు సైతం స్మార్ట్‌ఫోన్‌తో గడిపేస్తూ ప్రయాణం సాగించేస్తున్నారు. సోషల్ మీడియా వల్ల సైబర్ క్రైం రేటు, హ్యాకింగ్ ఉరకలు పెడుతోంది. ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా బజార్లో పెడుతున్నారు. లేదా బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. అయితే.. ఇప్పుడు అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. సెల్‌ఫోన్ చోరీకి గురైతే దానిని పూర్తిగా పనిచేయకుండా చేసే సాఫ్ట్‌వేర్‌లు ఉన్నాయి. అలాగే సోషల్ మీడియా ద్వారా ఎవరు బాధ్యతారహితంగా.. నిబంధనలు గాలికి వదిలేసి ప్రవర్తించారో పోలీసులు కచ్చితంగా పట్టేస్తారు. ఆ పరిజ్ఞానాన్ని ఇప్పటికే వాడుతున్నారు. ఎన్ని లక్షలసార్లు షేర్ చేసినా సదరు పోస్టు మూలాన్ని వెతికి వెలికితీసే సదుపాయం ఉంది. ఏ మూలన దాక్కునా పట్టుకొచ్చి చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

● చాలామంది చెప్పుకోలేక...

సోషల్ మీడియాలోని అధిక శాతం మంది బాధితులు బయటకు చెప్పుకోకుండా కుమిలిపోతుంటారు. కొందరు తేలిగ్గా వదిలేస్తారు. అందువల్ల చట్టాన్ని ఆశ్రయించే వాళ్ల సంఖ్య కూడా బాగా తక్కువగా ఉంటోంది. పెద్ద ఇబ్బంది ఎదురైతే గానీ చట్టాన్ని ఆశ్రయించడం లేదు. ఇది సరికాదని నిపుణులు చెబుతున్నారు. చట్టపరంగా శిక్షలుపడినప్పుడే సోషల్ మీడియా వల్ల ప్రతికూలతలు తగ్గుతాయని సూచిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. సోషల్ మీడియా, సైబర్ క్రైంలను ప్రతి క్షణం గమనిస్తూ ఉండడానికి ప్రత్యేకంగా ఒక సీఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో ఒక టీం నిరంతరం పనిచేస్తోంది. అసభ్యకర పోస్టులు, కామెంట్లు పెడితే ఇట్టే పట్టేసి బాధ్యులను కటకటాల్లోకి నెట్టేస్తారు. ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఐటీ యాక్ట్ సెక్షన్ 67 ప్రకారం ఐదేళ్ల శిక్ష పడుతుంది. ఉద్దేశపూర్వకంగా మహిళను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేదికల ద్వారా అవమానించడం, వెంటపడడం, దూషించడం వంటి వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల జైలుకు సిద్ధం కావాల్సిందే. ఇలా వివిధ చట్టాల ప్రకారం శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. మరోవైపు ప్రతి కుటుంబంలోనూ ఇలా కామెంట్లు పెడుతుంటే వెంటనే వారికి పోకడలను అరికట్టేలా చర్యలు చేపట్టాలి.



సూపర్ లగ్జరీ నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న దుర్గేష్

నిడదవోలు టు విశాఖకు బస్సు

సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై10: నిడదవోలు నుంచి విశాఖపట్నం వెళ్లే నూతన బస్సు సర్వీసు ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలో ఆర్టీసీ డిపో ఆవరణలో నిడదవోలు నుంచి వయా పండిగి రాజమహేంద్రవరం మీదుగా విశాఖపట్నం వెళ్లే సూపర్ లగ్జరీ నూతన బస్సు సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు అన్ని మారుమూల ప్రాంతాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. అనంతరం మంత్రి దుర్గేష్ విలేకర్లతో మాట్లాడుతూ టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం పర్యాటక రంగంలో బాగా అభివృద్ధి చెందిందని, నిడదవోలును కేంద్రంగా తీసుకుని ఈ ప్రాంతంలో ఉన్న అన్ని దేవాలయాలకు ఇతర పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లే విధంగా ప్రత్యేకమైన ప్యాకేజీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. మారుమూల ప్రాతాలకు పల్లె వెలుగు బస్సుతోపాటు దూర ప్రాంతాలకు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను పెంచుతూ నిడదవోలు డిపోకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిలాఅశోక్, జనసేన నాయకులు రంగా రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో తాత్కాలిక టికెట్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్ పనుల నిమిత్తం ఈనెల 31 వరకూ మూసేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రయాణికులు రెండు, మూడు ప్లాట్‌ఫాంలకు వెళ్లాల్సి వస్తోంది. రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా మెట్ల మార్గం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉంది. ఈ మార్గంలో ద్వారా ఒకటో ప్లాట్‌ఫాంకి వెళ్లకుండా నేరుగా రెండు, మూడు, నాలుగు, ఐదు ప్లాట్‌ఫాంలకు వెళ్లే వెసులుబాటు ఉన్నా పెద్దగా వినియోగించడం లేదు. అయితే ప్రధాన ద్వారం వద్ద టికెట్ బుకింగ్ కౌంటర్లు ఉన్నాయి. టికెట్లు తీసుకున్నవాళ్లు ఈ మార్గం ద్వారా వెళ్లాలంటే మళ్లీ వెనక్కు రావాలి. దీంతో ఇప్పుడు ఉన్న టికెట్ కౌంటర్లలో టికెట్ కొనుక్కొని రెండో ప్లాట్‌ఫాంకి వెళ్లడానికి నేరుగా ఒకటో ప్లాట్‌ఫాంకి వెళుతున్నారు. అక్కడ భద్రతరీత్యా బారికేడింగ్ కట్టడంతో ఇబ్బంది అవుతోంది. పైగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అందువల్ల రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న మెట్ల మార్గం ప్రవేశంలో కొంత ఖాళీ ప్రదేశం ఉంది. దీనిలో తాత్కాలికంగా టికెట్ బుకింగ్ పెడితే ప్రయాణికులకు సదుపాయంగా ఉంటుందని 'ఆంధ్రజ్యోతి' మంగళవారం 'రైల్వే ప్రయాణికుల పనైపోతోంది' అనే శీర్షికతో వెలువడిన కథనంలో సూచించింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రైల్వే అధికారులు.. ఆ సదుపాయం కల్పించే చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. బుకింగ్ కౌంటర్‌కి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఈ ప్రవేశం వద్ద సూచన ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేస్తే రిజర్వేషన్ ప్రయాణికులకు కూడా బాగా ఉపయోగంగా ఉంటుంది.



మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద శిలాఫలకాలను పరిశీలిస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్

మోరంపూడి ఫ్లైఓవర్..

ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి..

» ప్రజలకు అంకితం చేస్తాం : ఎంపీ పురందేశ్వరి
» ఫ్లైఓవర్ పరిశీలించిన ఎంపీ, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 10: ప్రజాప్రయోజనాల దృష్ట్యా నిత్యం రద్దీగా ఉండే మోరంపూడి జంక్షన్‌లో నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ను ఆగస్టు 15 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం మోరంపూడి ఫ్లైఓవర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపి మాగంటి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్, అధికారులతో ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలపై కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎంపీ పురందేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ మోరంపూడి ఫ్లైఓవర్ వివాదస్పదంగా మారిన నేపథ్యంలో వాస్తవాలు అందరికీ తెలియాలన్నారు. గత ప్రభుత్వం ప్రజాశ్రేయస్సుకంటే రాజకీయ లబ్ధికోసం ప్రయత్నాలు చేసి శిలాఫలకాలు మార్చేశారన్నారు. గతంలో మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ చేసిన కృషి గురించి ప్రస్తావించారు. మురళీమోహన్ హయాంలో రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమిస్తూ ప్రమాదాలను నియంత్రించేవిధంగా మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి మంజూరు తెచ్చారని చెప్పారు. 216 జాతీయ రహదారిపై 1.42 కిలోమీటర్ల నిడివితో నాలుగులేన్ల ఫ్లైఓవర్‌ను గతంలో రూ.60 కోట్ల అంచనాతో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వీసు రోడ్డు స్థల సేకరణ, ప్రాజెక్టుకు సంబంధించి అభివృద్ధికి మొత్తం సుమారు రూ.100 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఖర్చుచేసిందన్నారు. ఈ ఫ్లైఓవర్‌ను త్వరలో ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతుంటే ఆనాడు ఎంపీగా ఉన్న మురళీమోహన్ స్పందించి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి ఫ్లైఓవర్లు మంజూరు చేయించారని, తర్వాత ఎంపీ అయిన భరత్‌రామ్ ఫ్లైఓవర్‌ను తానే తెచ్చానని పబ్లిసిటీ చేసుకున్నాడన్నారు. దీంతోపాటు ఈ ఎస్ఐ హాస్పటల్‌కు, గౌతమీ గ్రంథాలయం, కంబాలచెరువులో ఏర్పాటుచేసిన జాతీయ పతాకానికి శాంక్షన్ ఇచ్చింది అప్పటి ఎంపీ మురళీమోహన్ అని అన్నారు. కానీ మాజీ ఎంపీ భరత్‌రామ్ మాత్రం తాను సాధించినట్టు ప్రచారం చేసుకున్నాడన్నారు. మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ కూటమికి అద్భుతమైన విజయాన్ని ఇచ్చిన ప్రజానీకానికి తన కృతజ్ఞతలన్నారు. ఆనాడు మోరంపూడి ఫ్లైఓవర్ కోసం అనేకసార్లు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల ఫొటోలను తీసుకుని వెళ్లి చూపించానన్నారు. అప్పుడు మోరంపూడి ఫ్లైఓవర్‌తోపాటు నాలుగు ఫ్లైఓవర్‌లకు శాంక్షన్ తీసుకువచ్చానన్నారు. ఈ ఫ్లైఓవర్ల కోసం ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు, రాజమహేంద్రవరం ప్రజానీకానికి తెలుసునని, దానికోసం పదేపదే చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఆగస్టు 15నాటికి మోరంపూడి ఫ్లైఓవర్ పూర్తయితే ప్రారంభోత్సవాన్ని చూడాలని ఉందని, తాను తప్పక వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీను, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మజ్జి రాంబాబు, కాతేరు టీడీపీ నాయకుడు గంగిన రంగయ్యచౌదరి (నాని) తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతి


వినియోగదారుల చెంతకు 2,390 మెట్రిక్ టన్నుల ఇసుక

» ఇంకా 3 లక్షల 261 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంది
» ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకే లావాదేవీలు
» జిల్లా స్థాయి కమిటీ మీటింగ్‌లో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై10: జిల్లాలోని 7 స్టాక్ పాయింట్ల ద్వారా ఈనెల 9న 2390 మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగాదారులకు చేరిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారునికి ఇసుక ఎంత ధరకు అందుబాటులో ఉందనే వివరాలు పారదర్శకంగా ప్రదర్శించే ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఏ రోజుకారోజు ఏ మేరకు స్టాకు నిల్వ ఉందో, ఎంత వినియోగం జరిగిందో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఉచిత ఇసుక పాలసీకి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.43ను అనుసరించి నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇసుక రవాణాకు ఉపయోగించే వాహనానికి సంబంధించి ఎంతమేర ఇసుక తరలిస్తున్నారో అంచనాకు వచ్చి ఆ మేరకు నిఘా వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ చేయాల్సిఉందన్నారు. నియమాలు ఉల్లంఘించే వారిపై అపరాధ రుసుం విధించాలని, ఇందుకు డీఎల్ఎస్ఏ కమిటీలోని అధికారులందరికీ అధికారం ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వాహన పరిమితికి మించి ఇసుక రవాణా చేయరాదన్నారు. ప్రతి వాహనానికి తప్పకుండా జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్టాకపాయింట్లు, డిసిల్టేషన్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ పాయింట్ల ఇన్చార్జిగా వ్యవహరించే వ్యక్తులకు పూర్తి స్థాయిలో స్టాక్ వివరాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సమావేశంలో స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్ను ఇసుక రూ.270, డి-సిల్టేషన్ పాయింట్ వద్ద టన్ను ఇసుక రూ.420గా ధరను నిర్ణయిస్తూ తీర్మానించారు. ఇరిగేషన్ అధికారులు డి-సిల్టేషన్ రిజర్వాయర్లను, ట్యాంక్ బండ్స్‌ను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ సెబ్, పంచాయతీరాజ్, పోలీసులు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సమీకృత చెక్ పోస్టులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక రవాణా జరగకుండా స్టాక్ పాయింట్ల వద్ద ముందే చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఇసుక లావాదేవీలు పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ విధానం అమలు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.నరసింహులు, మైన్స్ సహాయ సంచాలకులు ఎం.సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఈఈ జి కాశీ విశ్వేశ్వరరావు, ఆర్డీవో కేవీ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డి బాలశంకరావు, డీపీవో డి రాంబాబు, ఇరిగేషన్ డీఈ రమేష్, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఇక 24 X7 వైద్యం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10: ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది 24X7 మూడు షిఫ్టుల్లో తప్పనిసరిగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రతి పీహెచ్‌సీలోని సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెలిపారు. నైట్ డ్యూటీలో రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకూ స్టాఫ్‌నర్సులకు తోడుగా నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండడంలేదనేదానిపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా సిబ్బందిపై కఠిన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల కోసం కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులకు, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండేలా, విధుల నిర్వహణకు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అందరికీ ఆదేశాలు ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



దేవరపల్లిలో పొగాకు రైతుల పురస్కార సభలో ఎంపీ పురందేశ్వరిని ఘనంగా సత్కరిస్తున్న పొగాకు రైతు సంఘం నాయకులు

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు
మరో ముగ్గురు శాస్త్రవేత్తలకూ పురస్కారాలు
అందజేసి సత్కరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
దేవరపల్లిలో టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా కార్యక్రమం

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు

సత్కరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

దేవరపల్లిలో టుబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పురస్కారోత్సవం

దేవరపల్లి, జూలై 10: 'ప్రపంచంలోనే నాణ్యమైన పొగాకు ఉత్పత్తులకు మనదేశం పెట్టిందిపేరు. అందులోనూ అత్యధిక స్థాయిలో పొగాకు పండించేది కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని' రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం కరుటూరి ఫంక్షన్ హాలులో టుబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) 24వ అవార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని పొగాకు శాస్త్రవేత్తలు, రైతులను అవార్డులతో సత్కరించారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 16 మంది అవార్డులకు ఎంపిక కాగా, ఇందులో 13 మంది రైతులకు, ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారాలను అందించారు. పొగాకు సాగులో ఆధునిక సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, పొగాకు పంట పరిశోధన, అభివృద్ధిలో నిమగ్నమైన అభ్యుదయ రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఎంపిక చేసి వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన అవార్డు ప్రదానోత్సవ సభలో పురందేశ్వరి మాట్లాడుతూ పొగాకు సాగులో రైతులతో పాటు శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని, వారికి అవార్డులు అందించడం హర్షణీయమని చెప్పారు. ఈ ఏడాది అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బతిందన్నారు. రైతుల కోరిక మేరకు పరిమితికి మించి జరిగిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దు చేయాలని వాణిజ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో మాట్లాడామని త్వరలోనే నిర్ణయం వస్తుందన్నారు. పొగాకు ఉత్పత్తిలో కూలీల ఖర్చు పెరిగిపోయిందని, దానికి ఆకురెల్చు యంత్రాలు, ఆకు కుట్టే యంత్రాలను తయారు చేయాలని, కలప కూడా దొరికే పరిస్థితి లేనందున బేరన్‌లో పొగాకు క్యూరింగ్ చేయడానికి గ్యాస్ ద్వారా సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేయడానికి సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని, పొగాకుకు, పామాయిల్ పంటకు సంబంధించి రైతుల తరపున తాము సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించుకోవడానికి రైతులు విపరీతంగా రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పొగాకు ఉత్పత్తి చేయాలన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు పంట ద్వారా రూ.12 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభిస్తోందని, ఈ పొగాకు పంటపై 4 వేల కోట్ల మంది ఆధారపడుతున్నారన్నారు. పొగాకు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, పొగాకు పంట పరిమితి మేరకే పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ వాసుబాబు, టుబాకో బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్, పొగాకు రైతు సంఘం నాయకులు, అవార్డు గ్రహీతలు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ పొగాకు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

పొగాకు రైతు పురస్కార గ్రహీతలు వీరే :

సయ్యద్‌బాజీ(కొయ్యలగూడెం బోర్డు, అచ్చయ్యపాలెం), గురుబ్రహ్మం (కనిగిరి బోర్డు, భూతవారిపల్లి), టి.వెంకటశేషమ్మ (ఒంగోలు బోర్డు, చేకూరుపాడు) ఎ.శ్రీనివాస్‌రెడ్డి (వినుకొండ బోర్డు, యోగిరెడ్డిపాలెం) జి.సంజీవ్‌రెడ్డి (వినుకొండ బోర్డు, రెడ్డినగర్), కె.వెంకటసత్యనారాయణ (జంగారెడ్డిగూడెం-1 బోర్డు, పెద్దాపురం), ఎస్.ఎం.రెడ్డి (కందుకూరు-2 బోర్డు ఓలేటివారిపాలెం), కె.అంజిరెడ్డి (వెల్లంపల్లి బోర్డు, జి.నిడమర్రు), సుజాత (కొత్తదొడ్డి బోర్డు, రాయ్‌చూర్), సత్తి జగదీశ్వర్‌రెడ్డి (దేవరపల్లి బోర్డు, కృష్ణంపాలెం) జి.వి.రమణారెడ్డి, (కందుకూర్-1 బోర్డు, సింగరబొట్లపాలెం)

అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలు

డాక్టర్ వై.సుబ్బయ్య, డాక్టర్ పూర్ణబిందు, డాక్టర్ సీ.నంద

లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు

గద్దే బాబురాజేంద్రప్రసాద్ (జంగారెడ్డిగూడెం-2, రెడ్డి గణపవరం), జి.నరసపనాయుడు (డీసీ.పల్లి, గుండెమడకల గ్రామం)



ఎంపీ హరీష్‌మాధుర్‌ను కలిసిన కోనసీమ జేఏసీ ప్రతినిధులు

ఐదేళ్ల లోపు కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తి

ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూలై 10: లోక్‌సభ దివంగత స్పీకర్, తన తండ్రి జీఎంసీ బాలయోగి ఆశయ సాధనలో భాగంగా కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పూర్తి చేయడమే తన లక్ష్యమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. బుధవారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కోనసీమ జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కోనసీమ రైల్వేలైన్ గురించి చర్చించగా.. ఎంపీ స్పందిస్తూ ఐదేళ్లలోపు కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. భూసేకరణలో జాప్యం కారణంగానే పనులు ముందుకు సాగట్లేదని జేఏసీ సభ్యులు ఎంపీ దృష్టికితీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, సహ కన్వీనర్లు యిళ్ల భక్తవత్సలం, కరాటం ప్రవీణ్, మంత్రిప్రగడ వేణుగోపాల్, సభ్యులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, అన్యం రాంబాబు, రంకిరెడ్డి కాశీ, నీలి సంసోను, నంద్యాల నాయుడు, పమ్మి నాగేశ్వరరావు, టి.సుందరరామయ్య పాల్గొన్నారు.



అభినందనలు తెలియజేస్తున్న ఏపీ ఎన్జీవో నాయకులు

గోదావరి డెల్టా సిస్టం సీఈగా

బాధ్యతల స్వీకరణ

ధవళేశ్వరం, జూలై 10: గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్‌గా క్వాలిటీ చీఫ్ ఇంజనీర్ పుల్లారావు బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు కార్యాలయంలో కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాజబాబు, బి.లక్ష్మణుడు, పీఎస్ శేషకుమార్, కుమారస్వామి, వాసుదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లేఖ

రంగంపేట, జూలై 10: ఏడీబీ రోడ్డు గుంతలు తక్షణమే పూడ్చాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. రాజానగరం నుంచి సామర్లకోట వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే అర్ధాంతరంగా ఆగిపోవడంతో దారుణంగా పాడైపోయిందని, రాజానగరం సెంటర్ నుంచి రామస్వామిపేట వరకు గల ఏడీబీ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉందని, ఈ రోడ్డు మీద రోజూ వేలాది వాహనాలు కాకినాడకు నిత్యం ప్రయాణం చేస్తుంటాయని ఈ గుంతల రోడ్డు కారణంగా ఈ మధ్య కాలంలో వందలాది మంది ప్రమాదాలకు గురయ్యారని లేఖలో పేర్కొన్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్‌ను కలిసి ఈ రోడ్డు గుంతలు తక్షణమే పూడ్చాలని కోరినట్టు లేఖలో పేర్కొనగా వారు సానుకూలంగా స్పందించారని ఐవీ తెలిపారు.

అత్యాచార ఘటనపై ఏఎస్పీ విచారణ

ఎటపాక, జూలై 10: మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలో బుధవారం ఏఎస్పీ రాహుల్ మీనా క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఘటనపై బాధిత తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యాచార ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చేస్తామని చెప్పారు. అయితే వైద్య పరీక్షలు నిమిత్తం బాధిత చిన్నారిని చింతూరుకు తరలించారు. ఏఎస్పీ వెంట సీఐ డి.రామారావు, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఎస్ఐ పార్థసారథి, వీఆర్వో కన్నమ్మ ఉన్నారు.

డయేరియాతో చికిత్స పొందుతూ మృతి

సీతానగరం, జూలై 10: డయేరియా సోకిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీతానగరం గ్రామానికి చెందిన బేదంపూడి జగన్నాథం(61) ఈ నెల 2న డయేరియాతో సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. దీంతో వాంతులు, విరేచనాలు తగ్గాయి. అనంతరం ఈ నెల 5న రాజమహేంద్రవరంలోని కిడ్నీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి గంగా హాస్పటల్‌లో చేర్చగా అక్కడ డయాలసిస్ చేశారు. అక్కడ నుంచి ఈ నెల 9న కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. జగన్నాథంకు డయాలసిస్ చేస్తున్నారని కాకినాడ నుంచి రెండు రోజులలో వచ్చే రిపోర్టును పరిశీలించి మరణానికి గల కారణాలను నిర్ధారిస్తామని పీహెచ్‌సీ వైద్యులు డా. చైతన్య తెలిపారు.

800 కిలోల గంజాయి పట్టివేత

చింతూరు, జులై 10 : మోతుగూడెం పోలీసులు రూ. 40 లక్షల విలువైన 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా వివరాలు వెల్లడించారు. రెండు వేర్వేరు ఘటనలలో మొత్తం 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్‌గిరి, శివదయాల్, అలోక్ గోతం, రంజిత్‌మాఝి, దుర్గేశ్‌గోస్వామి ఒక ముఠాగా ఏర్పడ్డారు. అనంతరం ఈ ఐదుగురు ఒడిసా రాష్ట్రం, మల్కానగిరి జిల్లా అల్లూరికోటకు చెందిన సంజీవ్ అలియాస్ గెన్ను వద్ద 550 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతానికి తరలించారు. అక్కడ నుంచి మధ్యప్రదేశ్‌కు తరలించే క్రమంలో ఐచర్ వ్యాన్‌లో లోడ్ చేశారు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు కాపు కాచి ఐచర్ వ్యాన్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మధ్యప్రదేశ్‌కు చెందిన రంజిత్‌మాఝి, దుర్గేశ్‌గోస్వామిలతో పాటు ఒడిసాకు చెందిన సంజీవ్ పరారీలో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, కుంటకు చెందిన మజ్జి వెంకట్ సమంత్, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన సతీష్‌రెడ్డి, వరంగల్ జిల్లా జనగాంకు చెందిన యరవ వివేక్ డొంకరాయి పోలీసు స్టేషను పరిధిలోని మంగంపాడు నుంచి హైదరాబాద్‌కు కారులో 250 కిలోల గంజాయి తరలించే ప్రయత్నం చేశారు. మోతుగూడెం పోలీసులు కాపు కాచి కారుతో పాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ ఘటనలో సతీష్‌రెడ్డి, యరవ వివేక్ పరారీలో ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయి స్మగ్లింగ్ విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. తెలిసో తెలియకో వాహనాలను అద్దెకు ఇవ్వడం కూడా నేరమేనని ఏఎస్పీ చెప్పారు. వాహనాలను అద్దెకు ఇచ్చే సమయంలో సంబంధిత వాహన యజమానులు విధిగా పూర్తి వివరాలు తీసుకొని అద్దెకు ఇవ్వాలని ఏఎస్పీ సూచించారు. చింతూరు డివిజన్ పరిధిలో పోలీసు చెక్‌పోస్టులు పకడ్బందీగా ఏర్పాటు చేశారని, ఇకపై గంజాయి తరలింపు అనేది ఈ దిశగా అసాధ్యమని ఏఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్ మృతి



మృతిచెందిన చాంద్‌బాషా



మోతుగూడెం, జూలై10: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో బైక్ అదుపుతప్పి లోయలో పడడంతో మంగళవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరానికి ఎస్ఈబీ కానిస్టేబుల్ మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. చింతూరు ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చాంద్‌బాషా (54) చింతూరు నుంచి రాజమండ్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. తులసిపాక సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద బైక్ అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. ఈ ఘటనలో చాంద్ బాషా అక్కడికక్కడే మృతి చెందినట్లు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో కడియపులంక వాసి మృతి



కడియం, జూలై 10: మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ఇప్పటూర్‌లో విద్యుత్‌షాక్‌కు గురైన సంఘటనలో కడియం మండలం కడియపులంకకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాళ్ళకు చెందిన గోళ్ల నూకార్జున(36)కు ఓ వ్యాను ఉంది. ఓనర్ కం డ్రైవర్‌గా ఉన్నాడు. జీవనం కోసం కొన్నేళ్ల క్రితం కడియపులంక వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మామిడి మొక్కలను వేసుకుని నూకార్జున మహబూబ్‌నగర్ జిల్లా వెళ్లాడు. ఇప్పటూర్‌లో బుధవారం వ్యాన్‌లో వెళుతుండగా విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగలడంతో వ్యాన్‌కు విద్యుత్ సరఫరా అయ్యి మృతి చెందాడు. నూకార్జునకు భార్య సాయిదుర్గ, 9 ఏళ్ల కుమార్తె అశ్విని, 3 ఏళ్ల కుమారుడు రాజేష్ ఉన్నారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 10: అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ ఆధ్వర్యంలో 40వ వార్షికోత్సవం పురస్కరించుకుని 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. కాకినాడ సినిమారోడ్‌లోని సూర్యకళామందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నాటిక పోటీలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు తెలుగు వీర లేవరా-దీక్షబూని సాగరా పేరుతో సినీ సంగీత స్వరాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభ సభ జరుగుతుందన్నారు. సభలో ముఖ్య అతిథిగా కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), విశిష్ట అతిథిగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. రాత్రి 7 గంటలకు మలి సంధ్య, అనంతరం ఆ సరసాల నాటిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. 13వ తేదీన ఆంధ్రశ్రీ అవార్డును ప్రముఖ పారిశ్రామికవేత్త సలాది వీర వెంకట సత్యనారాయణమూర్తికి, 14న అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారాన్ని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు గుంటూరి తణుకులు(శ్యామ్)కు అందజేస్తామని వివరించారు. అనంతరం నాటిక పోటీల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. పరిషత్ ఉపాధ్యక్షులు బాపిరాజు, కిర్ల పుల్లారావు పాల్గొన్నారు.

ఇంకా లభ్యం కాని గల్లంతైన వృద్ధుడి ఆచూకీ



ఆర్ఆర్‌బీ చెరువు వద్ద పరిస్థితి సమీక్షిస్తున్న ఆర్డీవో, సీఐ

గొల్లప్రోలు రూరల్, జూలై 10: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర ఆచూకీ బుధవారం రాత్రి వరకూ లభ్యం కాలేదు. వేమన్నదొర పశువులు మేపేందుకు 7వ తేదీ సాయంత్రం మల్లవరంలోని ఆర్ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చునని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై పోలీసులు పరిశీలన జరిపారు. బుధవారం పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది, నలుగురు గజ ఈతగాళ్లు చెరువులోకి దిగి గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. గాలింపు చర్యలను తహసీల్దారు ఉదయభాస్కర్, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. చెరువు మొత్తంలో నీరు లేదని, మూడు మీటర్ల వెడల్పు గల కాలువలో మాత్రమే నీరు ఉన్నట్లు గుర్తించారు. హెలికాప్టర్ ద్వారా గాలిస్తే ఫలితం ఉండవచ్చునని గ్రామ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఈ నేపథ్యంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు గాలింపు చర్యలు కోసం హెలికాప్టర్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని పంపాలని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసారు. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం సాయంత్రం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగినా వృద్ధుడి ఆచూకీ కనుక్కోలేకపోయినట్టు స్థానికులు తెలిపారు. గురువారం గాలింపు చర్యలు కొనసాగనున్నాయి.

'రాజకీయ కక్షకు బలైన శ్రీనుకు విముక్తి కల్పించాలి'

ముమ్మిడివరం, జూలై 10: రాజకీయ కక్షకు బలైన జనిపల్లి శ్రీనివాసరావు (కోడికత్తి శ్రీను)కు కేసుల నుంచి విముక్తి కల్పించాలని విదసం (విశాఖ జిల్లాల దళిత సంఘాల ఐక్య వేదిక) విజ్ఞప్తి చేసింది. బుధవారం జనపల్లి శ్రీనివాసరావు, అతని సోదరుడు సుబ్బరాజు, విదసం నాయకులతో కలిసి విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మురముళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)కు ఈ మేరకు విన్నవించారు. ఎన్ఐఏ చట్టం 2008 సెక్షన్ 7-బి ప్రకారం కేసు దర్యాప్తు ప్రాసిక్యూషన్ నుంచి ఎన్ఐఏ వైదొలగాలని, రాష్ట్ర ప్రభుత్వం కేసును సమీక్షించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవీఎం పగులగొట్టి పోలింగ్ ఏజెంటును, పోలీసు అధికారిని కొట్టి రిమాండ్‌లో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జైలుకు వెళ్లి పలకరించిన జగన్మోహనరెడ్డి కోడి కత్తి కేసులో కనీసం కోర్టుకు రాకుండా కేసును సాగదీసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు స్పందించి... కోడికత్తి శ్రీనును త్వరలోనే ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విదసం నేతలు జాజి ఓంకార్, మూర మహేష్, బూల భాస్కరరావు, బల్ల కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన శ్రీను, విదసం సభ్యులు

సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా

బాధ్యతల స్వీకరణ



మోతుగూడెం, జూలై10: సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ద్రోణం రాజు చిన కామేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ప్రమోషన్ మీద సీలేరు కాంప్లెక్స్ లోయర్ సీలేరులో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది పి.ఆనంద్‌బాబు, వేమగిరి కిరణ్ రామారావు, కామేష్, ఏపీ జెన్కో లోయర్ సీలేరు ఉద్యోగస్తులు ఇంజనీర్స్, కాంట్రాక్ట్ కార్మికులు అభినందనలు తెలిపారు.

దంగేరులో మహా ప్రస్థానం సిద్ధం



కె.గంగవరం, జూలై 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం దంగేరు గ్రామంలో మహాప్రస్థానం సిద్ధమైంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో గ్రామానికి చెందిన రావిపాటి వంశీయుల వితరణ రూ.50లక్షలతో మహాప్రస్థానాన్ని సిద్ధం చేశారు. కైలాస రథాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై అంత్యక్రియలు నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రావి పాటి వెంకటగణేష్‌చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రావిపాటి రవీంద్రనాథ్‌చౌదరి, రావిపాటి రవి, పోలిశెట్టి సతీష్, ఉప్పులూరి సత్యనారాయణ, రావిపాటి వెంకట సుబ్బరాయ చౌదరి, దంగేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక ఉత్తర్వులు

రంపచోడవరం, జూలై 10: అంగన్వాడీ కేంద్రాలలో ఇటీవల ఉద్యోగాలు పొందిన వారికి రంపచోడవరం ఐసీడీఎస్ కేంద్రంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను అధికారులు ఇటీవల భర్తీ చేశారు. రంపచోడవరం ఐసీడీఎస్ పరిధిలోని ఆరుగురికి నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలుగా తల్లీబిడ్డల సంరక్షణ ఎంతో పవిత్రంగా నిర్వహించాలని కోరారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయభాస్కర్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో ఆర్గానిక్ పత్తి పండించే ప్రాజెక్టు



పీవోను కలిసిన నెదర్లాండ్స్ ప్రతినిధులు

రంపచోడవరం, జూలై10: మన్యంలో 4 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పత్తిని పండించే ప్రాజెక్టును నెదర్లాండ్స్‌కు చెందిన రెడీస్ స్వచ్ఛంద సంస్థ చేపడుతోందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నెదర్లాండ్స్ ప్రతినిధులతో జరిగిన సమావేశ వివరాలను ప్రాజెక్టు అధికారి వెల్లడించారు. గ్రామీణ వికాస కేంద్రం ద్వారా 4 వేల ఎకరాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని ఆయనకు బృందం వివరించింది. స్వీట్ ఆరెంజ్ మొక్కలు, పత్తి జిన్నింగ్ కోసం మిషనరీ ఏర్పాటు, పసుపు, జీడిపప్పు మార్కెటింగ్ కోసం కూడా నెదర్లాండ్ సహాయంతో ప్రణాళికలను సిద్ధం చేయడానికి చర్చించామని అన్నారు.

మంచినీళ్ల కోసం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు

కూనవరం, జూలై10: మండలంలోని మర్రిగూడెంలో గ్రామస్థులు మంచి నీళ్ల కోసం ధర్నా నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఊరులో ఉన్న బావి నీటిని కేవలం తన సొంత ఇంటికే ప్రభుత్వ మోటారు ద్వారా సరఫరా చేసుకుంటున్నాడని గ్రామస్తులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వెళ్లి వైసీపీ నాయకుల దగ్గర ఉన్న మోటారును తిరిగి గ్రామ పంచాయతీకి అప్పగించారు. దీంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

ఏజెన్సీ సమాచారం

నూతన ఇసుక విధానం ప్రారంభం

జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీషాదేవి



ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, జూలై 10: మన్యంలో ఉచిత ఇసుక విధానాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతులు రంపచోడవరంలో బుధవారం ప్రారంభించారు. ఇసుక లోడుతో వచ్చిన ట్రాక్టర్‌కు జెండా ఊపారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష దంపతులు ఇసుక ట్రాక్టర్‌పై వెళ్లగా పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చింతూరు, జూలై 10 : విలీన మండలాల్లో పలు సమస్యలు పేరుకుపోయాయని ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన కోరారు. ఈ మేరకు బుధవారం పలు సమస్యలను పేర్కొంటూ వినతి పత్రాన్ని చింతూరు ఐటీడీఏలో అందజేశారు. కల్పన మాట్లాడుతూ వరదల కాలం సమీపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పూసుగూడెం తదితర గ్రామాలలో రేషను కార్డులు లేక పలు పేద కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్నారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పి.రమేష్, ఎం భీమరాజు, కె.లక్ష్మి, పి.కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతిపత్రం

వరరామచంద్రాపురం, జూలై 10: మండలంలో నెలకొన్న విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీపీ కారం లక్ష్మి బుధవారం చింతూరు ఐటీడీఏలో పీవో చైతన్యకు వినతి పత్రం అందజేశారు. కేజీబీవీ ప్రహరీ, అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఉమ్మిడివరం నుంచి గుర్రంపేట వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల ర్యాలీ

వరరామచంద్రాపురం, జూలై 10: మండలంలోని అంగన్‌వాడీ మిడ్డేమీల్స్, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం నుంచి రేఖపల్లి జంక్షన్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ లేబర్‌కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని వీఆర్వో వినోద్‌కు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం

రాజవొమ్మంగి జూలై 10: డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరేశ్వరావుకు అంగన్వాడీ, ఆశ, మిడ్‌డే మీల్ వర్కర్లు వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్కర్ల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో యాదగిరేశ్వరావు చెప్పారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామరాజు, అంగన్వాడీ, ఆశ వర్కర్ల నాయకులు కె.వెంకటలక్ష్మి, చిన్ని కుమారి, అమ్మిరాజు, చిన్ని రాంబాబు ఉన్నారు.

'వ్యాధుల కాలం అప్రమత్తంగా ఉండాలి'

కడియం, జూలై 10: కడియంలో పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, స్వీటుషాపులు, బేకరీలలో బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున స్థానిక ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ ఆదేశాలమేరకు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌మనోజ్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీటిద్వారానే ఎక్కువగా వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా హోటల్ యజమానులు పరిశుభ్రమైన నీటితోనే ఆహార పదార్థాలు తయారు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. అవసరమైతే హోటల్‌లోని ఆహారపదార్థాలు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్టులలో తేడా వస్తే హోటల్స్ సీజ్‌చేసి యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

అర్బన్ ఫుడ్ ప్లాజాను తొలగించాలని ఎమ్మెల్యేకు వినతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10: రాజమహేంద్రవరం ఆర్ట్సకళాశాల ఆవరణలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిల వసతి గృహాలను అనుకుని ఏర్పాటు చేసిన ఈట్‌స్ట్రీట్ అర్బన్ ఫుడ్ ప్లాజాలు మహిళల భద్రతకు విఘాతం కలిగిస్తున్నందున వాటిని అక్కడి నుంచి తొలగించాలని దళిత నాయకుడు కాశి నవీన్‌కుమార్, కోరుకొండ చిరంజీవి, మర్రి బాబ్జి , వైరాల అప్పారావులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారంతా ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ వసతి గృహాలలో సుమారు 400 మంది విద్యార్థినిలు చదువుకుంటున్నారని అర్ధరాత్రి వరకు తాగుబోతులు ఈ ప్రాంతంలో తిరుగుతున్నారని, అనునిత్యం భయంతో విద్యార్థినులు చదువుపై ఏకాగ్రత సారించలేకపోతున్నారని వారు చెప్పారు. కార్యక్రమంలో దళిత నాయకులు ధారా యేసురత్నం, చాపల చిన్నరాజు, మోతా నాగలక్ష్మి, బారు చిన్ని, అజ్జరపు రమేష్, బేరా చిన్ని, కవులూరి వెంకట్రావు, బాబ్జి, ప్రభు, కృపామణి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోరుకొండ, జూలై10: ఎన్నికలకు ముందు ఎన్డీయే కూటమి రాష్ట్రంలోని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం బూరుగుపూడి టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి చంటిబాబు, తనకాల నాగేశ్వరరావులు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉచిత ఇసుకవిధానంవల్ల రాష్ట్రంలో 50 లక్షల భవననిర్మాణ కార్మికుల కుటుంబాల్లో వెలుగు నింపారని కొనియాడారు. ఇందుకు సహకరించిన జనసేన, బీజేపీ పార్టీ నాయకత్వాలను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజలందరికీ ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ మరోకార్యదర్శి తనకాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వంఏర్పడిన మొదటి నెలలో ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్‌సిక్స్‌లో ఐదింటిని ఇప్పటికే ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి తీసుకొచ్చిందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మరో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగంగిశెట్టి చంటిబాబు మాట్లాడుతూ సామాన్య ప్రజలు ఆనందంగా ఇళ్లు నిర్మించుకుంటారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు అడపా వీరబాబు, బుడ్డిగ వీర వెంకట సత్యనారాయణ, మాదబోయిన అప్పారావు, తదితరులుపాల్గొన్నారు.

'ఉచిత ఇసుక విధానంతో నిత్యం ఉపాధి'

దివాన్‌చెరువు, జూలై 10: కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుకవిధానంతో భవననిర్మాణ కార్మికులకు నిత్యం ఉపాధి లభిస్తుందని టీఎన్‌టీయూసీ జిల్లా అధికారప్రతినిధి దాసరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కొత్త విధానం వల్ల అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ప్రజలకు చేసిన వాగ్దానం మేరకు అధికారం చేపట్టిన కొద్ది రోజుల వ్యవధిలోనే ఈ ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుండడంతో పేద, మధ్యతరగతి వర్గాల వారితోపాటు భవన నిర్మాణ, అనుబంధ రంగాల కార్మికులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

పురుగు మందుల షాపుల తనిఖీ

కడియం, జూలై 10: ః వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఆత్మ డీపీడీ (విశాఖపట్టణం) ఏ.మోహనరావు, విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ (శ్రీకాకుళం) బి.సింహాచలంలు బుధవారం వ్యవసాయాధికారి ద్వారకాదేవితో కలిసి కడియం మండలంలో వీరవరం, బుర్రిలంక గ్రామాల్లో పురుగుమందుల షాపులను తనిఖీలు చేశారు. రికార్డుల నిర్వహణ, ఆయా షాపుల్లో ఏఏ కంపెనీల పురుగుమందులు విక్రయం చేస్తున్నారు అనే విషయాలను పరిశీలించారు. పంటల సాగుకు సంబంధించి రైతులకు విక్రయించే పురుగుమందుల విషయంలో సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవన్నారు.

రైసు మిల్లర్లు రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- జిల్లా రైస్‌మిల్లర్లచే ఎమ్మెల్యే నల్లమిల్లికి ఘన సత్కారం



ఎమ్మెల్యే నల్లమిల్లిని సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

అనపర్తి, జూలై 10: రైసుమిల్లర్లు కేవలం వ్యాపార దృక్పథమే కాకుండా రైతుల సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని తూర్పుగోదావరిజిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కళ్యాణ మం డపంలో జిల్లా నూతనకార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్ర మంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కర్రి వెంకటరెడ్డిని కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అనపర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జిల్లా రైస్‌మిల్లర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ ఒక ఏడాదిలో మిల్లర్ల పరిస్థితి మెరుగ్గా ఉంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే వారని మరో ఏడాది రైతులు పరిస్థితి ఆశాజనకంగా ఉంటే మిల్లర్లు ఇబ్బందులు పడేవారని గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇటు మిల్లర్లు, అటు రైతులు ఇబ్బందులు ఎదు ర్కొనడం విచిత్రమన్నారు. ఐదేళ్లుగా మిల్లర్లు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రభుత్వం మిల్లర్లకు చెల్లించాల్సిన మిల్లింగ్ చార్జీలను కూడా కోట్లకొలదీ బకాయిలు పెట్టిందన్నారు. రైతులకు కనీసం సాగునీరు అందించే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. మిల్లర్లు ఐకమత్యంగా ఉంటే సమస్యల పరిష్కారానికి వీలుంటుందన్నారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముందుగా జిల్లా అధ్యక్షుడిగా కర్రి వెంకటరెడ్డి, కార్యదర్శిగా మల్లిడి రామమూర్తిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సూరపురెడ్డి వీర్రాజు, ట్రెజరర్‌గా బలుసు శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారంచేశారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని నూతన కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువా గజమాలలతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్లు నల్లమిల్లి బులిమోహనరెడ్డి, కొవ్వూరి పాపారెడ్డి, మేడపాటి రామలింగారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సూర్యశ్రీ, పద్మశ్రీ రైస్‌మిల్లుల అధినేతలు పోతంశెట్టి బుజ్జి సోదరులు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైస్‌మిల్లర్లు, ఎన్డీయే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు రోగులతో ప్రేమపూర్వకంగా మెలగాలి

- జీజీహెచ్‌లో రోగుల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



జీజీహెచ్‌లో రోగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10 : వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులతో డాక్టర్లు ప్రేమపూర్వకంగా మాట్లాడాలని, వారి బాధను సహృదయంతో అర్థం చేసుకోవడం ద్వారా సగం రోగం నయమైనట్టేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ఓపీ విభాగం వద్ద రోగులు, వారి కుటుంబీకుల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వైద్యులు కసురుకుంటున్నారని, కొన్ని మందులు లేవని చెబుతున్నారని, సదరం సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, వార్డుల్లో ఫ్యాన్లు లేవని, వైద్యసేవలు సకాలంలో అందడంలేదని వంటి ఫిర్యాదులు చేశారు. ఆరు నెలలుగా జీతాలు రావడంలేదని జీజీహెచ్ ట్రామా కేర్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. వీటిపై ఎమ్మెల్యే శ్రీనివాస్ స్పందిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఆర్ఎంవో ప్రణవ్‌లకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి అంబులెన్స్ పనిచేయడంలేదని ఎమ్మెల్యే దృష్టికి రాగా మరమ్మతులు అవసరమైతే తక్షణమే చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. రోగులు ఉక్కపోతతో అసౌకర్యానికి గురికాకుండా వార్డుల్లో అవసరమైనన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చేవారిలో ఎక్కువ మంది పేదవారే ఉంటారని అన్నారు. రేడియాలజీ విభాగంలో వైద్యులు లేకపోవడం వల్ల స్కానింగ్‌కు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని, త్వరలో వాటిని పరిష్కరిస్తామని అన్నారు. మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ కూడా కొద్దిసేపు అక్కడ ఉన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10 : గత ప్రభుత్వం హయాంలోపడిన ఇబ్బందులు, కష్టాలు కూటమి ప్రభుత్వంలో ఉండవని నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నేర్కేడో ఆధ్వర్యంలో స్థానిక హోటల్ షెల్టాన్‌లో ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు అభినందన సత్కార సభ ఘనంగా నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథులుగా మంత్రి దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ ఉండవల్లి, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజులు హాజరయ్యారు. వారిని నర్కేడో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, రాజమండ్రి చాప్టర్ అధ్యక్షుడు కే నాగేష్, కార్యదర్శి కూచిపూడి శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధి అనేది ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో బిల్డర్లు, రియల్ ఎస్టేస్ వ్యాపారులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల కృషి మరువలేనిది

- జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు

కడియం, జూలై 10: ప్రేరేపిత ప్రజనం ప్రక్రియ ద్వారా దేశంలో మొదటగా 1957 జూలై 10న చేపల బ్రీడింగ్ ప్రక్రియ విజయవంతం చేసిన డా. హీరాలాల్‌చౌదరి, డా. కే హెచ్ ఆలీకున్ని శాస్త్రవేత్తల కృషి మరువలేనిదని జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు తెలిపారు. నేషనల్ ఫిష్‌ఫార్మర్స్‌డే సందర్భంగా బుధవారం కడియం లో జిల్లా మత్స్య శాఖ కార్యాలయం వద్ద జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యరంగం ఆరోగ్యభద్రతలో, ప్రోటీన్ సెక్యూరిటీలో గణనీయ పాత్ర వహిస్తుందన్నారు. ఆక్వారంగ అభివృద్ధికి కృషి చేసిన డా. హీరాలాల్‌చౌదరి, డా. కెహెచ్ ఆలీకున్ని శాస్త్రవేత్తలను స్మరించుకోవడం మన కర్తవ్యం అన్నారు. ఆక్వా రైతులు, చేపలు రొయ్యలు అమ్మేవారు, చేపల వంటకాలు తయారు చేసే వారు ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలన్నారు. ఈ రంగంలో విశేషకృషి చేసిన పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు షేక్ దిల్షాద్, రాజమహేంద్రవరం ఆర్ట్సకళాశాల లెక్చరర్ దుర్గారావు, తేజ, కళాశాల విద్యార్థులు, మత్స్యకార సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో రాజానగరంలో ఇంటర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



రాజానగరంలో స్టూడెంట్ కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం, జూలై 10: రానున్న రోజుల్లో నియోజకవర్గ కేంద్ర మైన రాజానగరంలో ఇంటర్‌తోపాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రా జానగరం హైస్కూల్లోని విద్యార్థులకు ప్రభుత్వం నుంచి విడుదలైన స్టూడెంట్స్ కిట్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువులను మధ్యలోనే మాన్పించకుండా తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎంపీపీఎస్ రాజానగరం నెంబర్-1, 2 పాఠశాలలు, సూర్యారావుపేట, తూర్పుగోనగూడెం, కలవచర్ల పాఠశా లల్లో స్థానిక కూటమి నాయకులు స్టూడెంట్ కిట్స్ అందజేశారు. కార్యక్ర మాల్లో ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

కోరుకొండ, జూలై10: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత స్టూడెంట్స్ కిట్స్‌ను ఆయా పాఠశాలల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అందజేశారు. గాదరాడ జడ్పీహైస్కూల్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని వి ద్యార్థులకు 3జతల యూనిఫాం, టై, బెల్ట్, రెండు జతల సాక్స్‌లు, ఒక జత షూట్‌తో కూడిన స్టూడెంట్స్ కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. వీరభద్రాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీసీ కాలనీ, పోలేరమ్మ టెంపుల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌దూది కాంతారావు, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు,కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు. అదే విధంగా కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు బత్తులవెంకటలక్ష్మి ఆధ్వర్యంలోస్టూడెంట్స్ కిట్స్ అందజేశారు.

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 10 : విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కిట్ల పంపిణీని ప్రారంభించారు. అనపర్తి ఎంఈవోలు నల్లమిల్లి సత్తిరెడ్డి, పుష్పలతల అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ పరిధిలో 15,249 మంది విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.2500 విలువైన కిట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లిని ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధాయులు సత్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవ దానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, గొలుగూరి రామ భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధితో వ్యాపారవేత్త విశాఖలో మృతి



వోగిరెడ్డి వెంకటరామారెడ్డి (ఫైల్)

అనపర్తి, జులై 10: అనపర్తికి చెందిన వ్యాపారవేత్త అరుదైన వ్యాధితో విశాఖపట్నంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. అనపర్తికి చెందిన వోగిరెడ్డి వెంకటరామారెడ్డి(64) పుట్టుక నుంచే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉన్న వెంకటరామారెడ్డికి ఈ విషయం 1984లో తెలిసింది. చికిత్స కోసం ఆయనను కుటుంబ సభ్యులు పలు దేశాలకు తీసుకువెళ్లినపుడు అక్కడి వైద్యులు కూడా దీనిని మిరాకిల్‌గానే వర్ణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉండగా, ఒక కుమారుడు విదేశాల్లో ఉండగా, మరో కుమారుడు వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురైన వెంకటరామారెడ్డి చికిత్స పొందుతూ బుధవారం విశాఖలోని ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మృతిపట్ల వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, పలువురు వ్యాపారులు సంతాపం ప్రకటించారు.

కానేడులో 35 లీటర్ల నాటు సారా, బెల్లపు ఊట స్వాధీనం

బిక్కవోలు, జూలై 10: బిక్కవోలు మండలం కానేడులో బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ, రంగంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించామని సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఈసందర్భంగా రాజానగరం మండలం రఘునాథపురంనకు చెందిన బల్లి సత్తిబాబు నుంచి 35 లీటర్ల నాటుసారా, వెయ్యి లీటర్ల సారా తయారీకి వినియోగించే పులిసిన బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామని ఆయన వివరించారు. ఈయన వెంట ఎస్ఐ జి.అనిల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు బజార్లలో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10 : జిల్లాలోని రైతు బజార్ల ద్వారా గురువారం నుంచి బియ్యం, కందిపప్పు సబ్సిడీ ధరలపై విక్రయించనున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ధరల నిర్ణయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిత్యావసర వస్తువులైన బియ్యం, కందిపప్పు ధరలు బహిరంగ మార్కెట్‌లో పెరిగిన నేపథ్యంలో వినియోగదారులకు సరసమైన ధరలకు సరుకులు అందేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. కందిపప్పును వినుకొండ మిల్లర్ల ద్వారా, బియ్యాన్ని కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లోని మిల్లర్ల ద్వారా కొనుగోలు చేసి ప్రజలకు సబ్సిడీ ధరలపై అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్, ఎస్పీ జగదీష్, డీఎస్‌పీఓ విజయభాస్కర్, సీపీఓ అప్పలకొండ, మార్కెటింగ్ ఏడీఎం సునీల్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల సూచనలు పాటిస్తే మానసిక రుగ్మతల నుంచి కోలుకోవచ్చు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు




రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ల సూ చనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే మాన సిక రుగ్మతల నుంచి బయట పడవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రిలోని మానసిక రుగ్మతల చికిత్సా కేంద్రాన్ని ఆయన బుధవారం సంద ర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి వైద్యులు ఆయనకు వివరించారు. మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని వారి కుటుంబాలతో కలిపే చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఆయన సూచించారు. ఈ విషయంలో న్యాయ సహాయం కావాలంటే డీఎల్ఎస్ఏ చేస్తుందని చెప్పారు. రోగులతో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు వైద్యం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించవద్దని ఆదేశించారు.

లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి

- శ్యామలాసెంటర్‌లో కార్మికుల డిమాండ్స్ డే

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10 : లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని శ్యామలాసెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి, ఆశ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు అన్నామణి, ఏపీఆర్‌పీఏ కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, బలాన్ని బాగా తగ్గించారని అన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం మళ్లీ తన పాత విధానాలనే కొనసాగించడానికి నిర్ణయించుకుందని అందుకే జూలై 10వ తేదీన డిమాండ్స్ డే జరుపుతున్నామని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందరంబాబు, బి.పూర్ణిమరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పోలిన వెంకటేశ్వరరావు, ఐ.సుబ్రహ్మణ్యం, సీపీఎం నగర కార్యదర్శి పవన్, సీఐటీయూ అనుబంధ సంఘాలు, అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు.





'బ్యాంకు' రాజకీయం

- కూటమి మద్దతుతో తెరమీదకు ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు
- శ్రీఘాకోళ్లపు ఇంటిలో వైసీపీ నేతల మంతనాలు
- నేడు నామినేషన్ల స్వీకరణ

రాజమహేంద్రవరం, జూలై10(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం అర్బన్‌బ్యాంక్ చైర్మన్ అభ్యర్థిగా మాజీ చైర్మన్ చల్లాశంకరరావు పేరు వినిపిస్తోంది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మద్దతుతో ఆయన తెరమీదకు వచ్చారు. మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉంటారు. ఓటర్లు డైరెక్టర్లను ఎన్నుకుంటే, డైరెక్టర్లు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. టీడీపీ మద్దతుతో ఎక్కువమంది డైరెక్టర్లు పోటీపడుతున్నారు. జనసేన మద్దతుదారు ఒకరు, బీజేపీ మద్దతుదారు ఒకరు ఉన్నారు. సుమారుగా పేర్లు ఖరారైనట్టు సమాచారం. రాజమహేంద్రవరంలోని చల్లా రెసిడెన్స్‌లో బుధవారం రాత్రి చల్లా శంకరరావు ప్యానల్ సభ్యులంతా సమావేశమయ్యారు. అటు వైసీపీ మద్దతుదార్లలో అయోమయం నెలకొంది. అర్బన్‌బ్యాంక్ విషయంలో పట్టున్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యంతో ఆయన ఇంట్లో బుధవారం మధ్యాహ్నం వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, చాంబర్ మాజీ ప్రెసిడెంట్ నందెపు శ్రీనివాస్ తదితరులు సమావేశమయ్యారు. పార్టీ ప్రమేయం లేకుండా కొందరిని పోటీ పెట్టేటట్టు ఆలోచించినట్టు సమాచారం. ఇక్కడ కూడా వైసీపీలో విభేదాలు కనిపించాయి. మాజీ ఎంపీ మార్గాని భరత్ వీరికి దూరంగా ఉండడం గమనార్హం. కానీ పార్టీ ప్రమేయం లేకుండా ఒక ప్యానల్‌ను పోటీలో పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. సభ్యుల కోసం వెతుకుతున్నారు. లంకా సత్యనారాయణతో పాటు కొందరు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. వైసీపీ మద్దతుదారులుకానీ, స్వతంత్ర అభ్యర్థులుకానీ పోటీలో లేకపోతే చల్లా ప్యానల్ ఏకగ్రీవం అవుతుంది. ఎవరైనా పోటీలో ఉంటే ఎన్నికలు జరుగుతాయి. ఉభయగోదావరి జిల్లాలు, విశాఖ, గుంటూరు జిల్లాల్లో 16 బ్రాంచిలు ఉన్నా ఈ బ్యాంక్ ఎన్నికల్లో 78,423 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కూటమి ప్యానల్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు, ఆయన ప్యానల్‌లో బీజేపీ తరపున యెనుమల రంగబాబు, జనసేన తరపున కప్పల సూర్యప్రకాష్, టీడీపీ మద్దతుతో పోలాకి పరమేశ్, పిల్లి శ్యామ్, ఎర్రమోతు ధర్మరాజు, కాకినాడ నుంచి సింగంపల్లి రామకృష్ణ, దివాన్‌చెరువు నుంచి నీలపాల సూర్యసత్యనారాయణ, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాస్, పడాల శ్రీను, బుడ్డిగ రవి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కాగా అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్లు స్వీకరించనున్నట్టు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారి దాఖలైన నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. 12తేదీ ఉదయం 11గంటల నుంచి నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది. తుది జాబితా ప్రకటిస్తారు. 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. 22న పాలకవర్గం కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటుంది.

హద్దు మీరితే జైలుకే



- సోషల్ మీడియాలో మితిమీరి కామెంట్లు, ట్రోలింగ్స్
- పోస్టులు పెట్టే ముందు.. కామెంట్, షేర్ చేసే సమయంలో బాధ్యతాయుతంగా ఉండాల్సిందే
- అదుపు తప్పితే కటకటాలే.. ఈ పోకడలపై జనంలోనూ విస్తృత చర్చ
- యువత తప్పు చేస్తే వారి భవిష్యత్తూ అంధకారమే.. కుటుంబమూ అల్లరి పాలు

స్మార్ట్‌ఫోన్.. ఆధునిక మనిషిలో ఆ మనిషికే తెలియకుండా ఓ అంగమైపోయింది. ఒంటిపై సరైన బట్టలు లేకపోయినా చేతిలో స్మార్ట్‌ఫోన్ మాత్రం ఉండాల్సిందే. చేతి వేళ్లు దాన్ని గీకుతూ ఉండాల్సిందే. లైక్, కామెంట్, షేర్ అనేది ఓ కొత్త జీవితం.. ట్రోలింగ్ వంటి పదాలూ పుట్టుకొచ్చాయి. ఈ మాయా ప్రపంచంలో సముద్రమంత మంచి ఉంటే ఆకాశమంత చెడు ఉందని పెద్దల గగ్గోలు మామూలే. చేతిలో ఇమిడిపోయే ఆ ఎలక్ట్రానిక్ ఉపకరణంలో సోషల్ మీడియా.. అదో ఎల్లలు లేని ప్రపంచం. ఎన్నో వీడియోలు.. మరెన్నో ఫొటోలు.. అంతులేని సమాచారం.. అవధుల్లేని పరిజ్ఞానం.. అంతే అంతుచిక్కని కంటెంట్. ప్రతి సెకనుకూ పది మంది చేరుతున్న ఓ లోకం. అన్నం లేకపోయినా చేతికి వేలు ఉంటే చాలు అనేంత దారుణమైన పరిస్థితి దాపురించింది.

బాధ్యతగా మెలగాలి: ఎస్పీ జగదీశ్

సోషల్ మీడియాలో బాధ్యతగా మెలగాలి. జీవితాల మెరుగుదలకు ఉపయోగపడేవిధంగా వినియోగించుకోవాలి. అసభ్యకర, అభ్యంతర, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా.. అలాంటి వాటిని లైక్, షేర్ చేయడం.. ట్రోలింగులు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు. వీటికి సంబంధించి ప్రజల వద్ద సమాచారం ఉంటే వెంటనే 9440796577 నెంబరుకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలి. అవసరమైతే అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. ఇది సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలి. ఇప్పటికే సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై నిరంతర నిఘా పెట్టాం. కఠిన చర్యలూ తీసుకుంటాం.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ట్విటర్(ఎక్స్), ఫేస్‌బుక్, యూట్యూబ్, టెలిగ్రాం, వాట్సాప్, ఇన్‌స్టా.. ఇలా చెప్పుకుంటేపోతే ఎన్నో వేదికలు. ఆ వేదికలపై మనిషి బుర్రలోని ఆలోచనలు ఓ చిత్ర రూపంలో తాండవిస్తుంటాయి. వాటికి కొంత ఆదాయమూ వస్తుంటుంది. అందుకే ఈమధ్య కాలక్షేపంకంటే డబ్బులు సంపాదనకూ సోషల్ మీడియాను ఎక్కువగా వాడేస్తున్నారు. అయితే.. స్మార్ట్‌ఫోనూ మనదే.. వేలూ మనదే అని బాధ్యత, నిబంధనలు మరిచి ప్రవర్తించే వాళ్ల కోసం కటకటాలు ఎదురు చూస్తుంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నిజమే.. సమాచారాన్ని, సృజనాత్మకతను, నైపుణ్యాలను పంచుకోవాల్సిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వికృత చేష్టలు.. విపరీత పోకడలు ఎక్కువైపోయాయి. ఇవి కొందరి మనోభావాలను దెబ్బతీస్తుంటే.. మరికొందరు సున్నిత మనస్కులు కుంగిపోతున్నారు.. ప్రాణాలు తీసుకున్నవాళ్లూ ఉన్నారు. సోషల్ మీడియాతో ప్రయోజనాలు ఎన్నో ఉన్నా ప్రమాదాలు కూడా తక్కువేమీ కాదని రుజువవుతూనే ఉంది. దీంతో సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై చట్టం దృష్టి సారించింది. మా ఇష్టం అంటూ రెచ్చిపోతున్న వాళ్లను జైలుకు పంపుతోంది. ఏమైనా సోషల్ మీడియా వాడేప్పుడు కాస్త ఒళ్లు దగ్గర పెట్టుకోకపోతే చిక్కుల్లో పడినట్టే.

● విపరీత పోకడలు

ఈమధ్య సోషల్ మీడియాలో విపరీతమైన పోకడలు కనిపిస్తున్నాయి. ఇష్టానుసారం పోస్టులు.. విచ్చలవిడిగా కామెంట్లు పెడుతున్నారు. ఇటీవల ప్రణీత్ హనుమంతు అనే యూట్యూబర్ తండ్రీకూతుళ్లపై పెట్టిన కామెంట్.. మానవ జాతికే అవమానంగా మిగిలిపోయింది. తీరా చూస్తే అతడు ఓ సీనియర్ ఐఏఎస్ కొడుకు. ఇతనేకాదు ఎంతోమంది సోషల్ మీడియాను అత్యంత హేయంగా వినియోగిస్తున్నారు. వీరిలో బాగా చదువుకున్న వాళ్లూ అధికంగా ఉండడంపై సభ్యసమాజం ఆందోళన వ్యక్తంచేస్తోంది. సోషల్ మీడియాను మానవ మనుగడను మెరుగుపరుచుకోడానికి, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వేదికలుగా చూడకుండా.. తమ వికృత చేష్టలకు ప్లాట్‌ఫాంలుగా భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు, కామెంట్ పెడితే దానికంటే చాటింపే మేలు అనిపిస్తుంది. ఎక్కడెక్కడికో అది వెళ్లిపోతుంది. ఫోన్లలో డౌన్‌లోడ్ కూడా అయిపోతోంది. దీంతో కామెంట్ పెట్టిన వారి మాటెలా ఉన్నా.. బాధితులు మాత్రం అల్లాడిపోతున్నారు.

● కచ్చితంగా పట్టేస్తారు

సోషల్ మీడియా అనేది ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన కమ్యూనికేషన్ మార్గం. ప్రపంచవ్యాప్తంగా 5 బిలియన్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇది ప్రపంచ జనాభాలో 62 శాతం. రోజు రోజుకూ ఆ సంఖ్య వేలల్లో పెరుగుతూనే ఉంది. దానితోబాటే అత్యంత హానికరమైన ప్రతికూలతలు కూడా పెరుగుతూ పోతున్నాయి. సోషల్ మీడియా వాడకం విపరీతమైన తర్వాత సామాజిక, భావోద్వేగ, మానవ సంబంధాలు.. కుటుంబ బంధాలు పలుచబడిపోయాయి. బుర్రలో పదును తగ్గిపోతోంది. అందరూ ఉన్నా ఒంటరివాళ్లు ఎక్కువైపోతున్నారు. పుస్తకాలు చదవడం ఎప్పుడో మానేశారు. చేతిలో పుస్తకం మాయమైపోయింది. ఏదో తెలియని గజిబిజి, గందరగోళం మెదడును కమ్మేస్తోంది. ఒక కుటుంబంలో నలుగురు ఉంటే సోషల్ మీడియలో విహరించడానికి ఇచ్చిన సమయంలో సగం కూడా ఒకరితో ఒకరు మాట్లాడుకోడానికి ఇవ్వడం లేదు. బస్సుల్లో, రైళ్లలో, విమానాల్లో పక్కపక్కన కూర్చున్న వారు సైతం స్మార్ట్‌ఫోన్‌తో గడిపేస్తూ ప్రయాణం సాగించేస్తున్నారు. సోషల్ మీడియా వల్ల సైబర్ క్రైం రేటు, హ్యాకింగ్ ఉరకలు పెడుతోంది. ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా బజార్లో పెడుతున్నారు. లేదా బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. అయితే.. ఇప్పుడు అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. సెల్‌ఫోన్ చోరీకి గురైతే దానిని పూర్తిగా పనిచేయకుండా చేసే సాఫ్ట్‌వేర్లు ఉన్నాయి. అలాగే సోషల్ మీడియా ద్వారా ఎవరు బాధ్యతారహితంగా.. నిబంధనలు గాలికి వదిలేసి ప్రవర్తించారో పోలీసులు కచ్చితంగా పట్టేస్తారు. ఆ పరిజ్ఞానాన్ని ఇప్పటికే వాడుతున్నారు. ఎన్ని లక్షలసార్లు షేర్ చేసినా సదరు పోస్టు మూలాన్ని వెతికి వెలికితీసే సదుపాయం ఉంది. ఏ మూలన దాక్కునా పట్టుకొచ్చి చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

● చాలామంది చెప్పుకోలేక...

సోషల్ మీడియాలోని అధిక శాతం మంది బాధితులు బయటకు చెప్పుకోకుండా కుమిలిపోతుంటారు. కొందరు తేలిగ్గా వదిలేస్తారు. అందువల్ల చట్టాన్ని ఆశ్రయించే వాళ్ల సంఖ్య కూడా బాగా తక్కువగా ఉంటోంది. పెద్ద ఇబ్బంది ఎదురైతే గానీ చట్టాన్ని ఆశ్రయించడం లేదు. ఇది సరికాదని నిపుణులు చెబుతున్నారు. చట్టపరంగా శిక్షలుపడినప్పుడే సోషల్ మీడియా వల్ల ప్రతికూలతలు తగ్గుతాయని సూచిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. సోషల్ మీడియా, సైబర్ క్రైంలను ప్రతి క్షణం గమనిస్తూ ఉండడానికి ప్రత్యేకంగా ఒక సీఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో ఒక టీం నిరంతరం పనిచేస్తోంది. అసభ్యకర పోస్టులు, కామెంట్లు పెడితే ఇట్టే పట్టేసి బాధ్యులను కటకటాల్లోకి నెట్టేస్తారు. ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఐటీ యాక్ట్ సెక్షన్ 67 ప్రకారం ఐదేళ్ల శిక్ష పడుతుంది. ఉద్దేశపూర్వకంగా మహిళను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేదికల ద్వారా అవమానించడం, వెంటపడడం, దూషించడం వంటి వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల జైలుకు సిద్ధం కావాల్సిందే. ఇలా వివిధ చట్టాల ప్రకారం శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. మరోవైపు ప్రతి కుటుంబంలోనూ ఇలా కామెంట్లు పెడుతుంటే వెంటనే వారికి పోకడలను అరికట్టేలా చర్యలు చేపట్టాలి.



సూపర్ లగ్జరీ నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న దుర్గేష్

నిడదవోలు టు విశాఖకు బస్సు

సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై10: నిడదవోలు నుంచి విశాఖపట్నం వెళ్లే నూతన బస్సు సర్వీసు ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలో ఆర్టీసీ డిపో ఆవరణలో నిడదవోలు నుంచి వయా పండిగి రాజమహేంద్రవరం మీదుగా విశాఖపట్నం వెళ్లే సూపర్ లగ్జరీ నూతన బస్సు సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు అన్ని మారుమూల ప్రాంతాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. అనంతరం మంత్రి దుర్గేష్ విలేకర్లతో మాట్లాడుతూ టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం పర్యాటక రంగంలో బాగా అభివృద్ధి చెందిందని, నిడదవోలును కేంద్రంగా తీసుకుని ఈ ప్రాంతంలో ఉన్న అన్ని దేవాలయాలకు ఇతర పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లే విధంగా ప్రత్యేకమైన ప్యాకేజీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. మారుమూల ప్రాతాలకు పల్లె వెలుగు బస్సుతోపాటు దూర ప్రాంతాలకు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను పెంచుతూ నిడదవోలు డిపోకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిలాఅశోక్, జనసేన నాయకులు రంగా రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో తాత్కాలిక టికెట్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్ పనుల నిమిత్తం ఈనెల 31 వరకూ మూసేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రయాణికులు రెండు, మూడు ప్లాట్‌ఫాంలకు వెళ్లాల్సి వస్తోంది. రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా మెట్ల మార్గం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉంది. ఈ మార్గంలో ద్వారా ఒకటో ప్లాట్‌ఫాంకి వెళ్లకుండా నేరుగా రెండు, మూడు, నాలుగు, ఐదు ప్లాట్‌ఫాంలకు వెళ్లే వెసులుబాటు ఉన్నా పెద్దగా వినియోగించడం లేదు. అయితే ప్రధాన ద్వారం వద్ద టికెట్ బుకింగ్ కౌంటర్లు ఉన్నాయి. టికెట్లు తీసుకున్నవాళ్లు ఈ మార్గం ద్వారా వెళ్లాలంటే మళ్లీ వెనక్కు రావాలి. దీంతో ఇప్పుడు ఉన్న టికెట్ కౌంటర్లలో టికెట్ కొనుక్కొని రెండో ప్లాట్‌ఫాంకి వెళ్లడానికి నేరుగా ఒకటో ప్లాట్‌ఫాంకి వెళుతున్నారు. అక్కడ భద్రతరీత్యా బారికేడింగ్ కట్టడంతో ఇబ్బంది అవుతోంది. పైగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అందువల్ల రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న మెట్ల మార్గం ప్రవేశంలో కొంత ఖాళీ ప్రదేశం ఉంది. దీనిలో తాత్కాలికంగా టికెట్ బుకింగ్ పెడితే ప్రయాణికులకు సదుపాయంగా ఉంటుందని 'ఆంధ్రజ్యోతి' మంగళవారం రైల్వే ప్రయాణికుల పనైపోతోంది' అనే శీర్షికతో వెలువడిన కథనంలో సూచించింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రైల్వే అధికారులు.. ఆ సదుపాయం కల్పించే చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. బుకింగ్ కౌంటర్‌కి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఈ ప్రవేశం వద్ద సూచన ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేస్తే రిజర్వేషన్ ప్రయాణికులకు కూడా బాగా ఉపయోగంగా ఉంటుంది.



మోరంపూడి ప్లైఓవర్ వద్ద శిలాఫలకాలను పరిశీలిస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్

మోరంపూడి ప్లైఓవర్..


ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి..

- ప్రజలకు అంకితం చేస్తాం : ఎంపీ పురందేశ్వరి
- ప్లైఓవర్ పరిశీలించిన ఎంపీ, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 10: ప్రజాప్రయోజనాల దృష్ట్యా నిత్యం రద్దీగా ఉండే మోరంపూడి జంక్షన్‌లో నిర్మిస్తున్న ప్లైఓవర్‌ను ఆగస్టు 15 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం మోరంపూడి ప్లైఓవర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపి మాగంటి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్, అధికారులతో ప్లైఓవర్ నిర్మాణం అంశాలపై కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎంపీ పురందేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ మోరంపూడి ప్లైఓవర్ వివాదస్పదంగా మారిన నేపథ్యంలో వాస్తవాలు అందరికీ తెలియాలన్నారు. గత ప్రభుత్వం ప్రజాశ్రేయస్సుకంటే రాజకీయ లబ్ధికోసం ప్రయత్నాలు చేసి శిలాఫలకాలు మార్చేశారన్నారు. గతంలో మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ చేసిన కృషి గురించి ప్రస్తావించారు. మురళీమోహన్ హయాంలో రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమిస్తూ ప్రమాదాలను నియంత్రించేవిధంగా మోరంపూడి జంక్షన్ వద్ద ప్లైఓవర్ నిర్మాణానికి మంజూరు తెచ్చారని చెప్పారు. 216 జాతీయ రహదారిపై 1.42 కిలోమీటర్ల నిడివితో నాలుగులేన్ల ప్లైఓవర్‌ను గతంలో రూ.60 కోట్ల అంచనాతో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వీసు రోడ్డు స్థల సేకరణ, ప్రాజెక్టుకు సంబంధించి అభివృద్ధికి మొత్తం సుమారు రూ.100 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఖర్చుచేసిందన్నారు. ఈ ప్లైఓవర్‌ను త్వరలో ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతుంటే ఆనాడు ఎంపీగా ఉన్న మురళీమోహన్ స్పందించి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి ప్లైఓవర్లు మంజూరు చేయించారని, తర్వాత ఎంపీ అయిన భరత్‌రామ్ ప్లైఓవర్‌ను తానే తెచ్చానని పబ్లిసిటీ చేసుకున్నాడన్నారు. దీంతోపాటు ఈ ఎస్ఐ హాస్పటల్‌కు, గౌతమీ గ్రంథాలయం, కంబాలచెరువులో ఏర్పాటుచేసిన జాతీయ పతాకానికి శాంక్షన్ ఇచ్చింది అప్పటి ఎంపీ మురళీమోహన్ అని అన్నారు. కానీ మాజీ ఎంపీ భరత్‌రామ్ మాత్రం తాను సాధించినట్టు ప్రచారం చేసుకున్నాడన్నారు. మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ కూటమికి అద్భుతమైన విజయాన్ని ఇచ్చిన ప్రజానీకానికి తన కృతజ్ఞతలన్నారు. ఆనాడు మోరంపూడి ప్లైఓవర్ కోసం అనేకసార్లు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల ఫొటోలను తీసుకుని వెళ్లి చూపించానన్నారు. అప్పుడు మోరంపూడి ప్లైఓవర్‌తోపాటు నాలుగు ప్లైఓవర్లకు శాంక్షన్ తీసుకువచ్చానన్నారు. ఈ ప్లైఓవర్ల కోసం ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు, రాజమహేంద్రవరం ప్రజానీకానికి తెలుసునని, దానికోసం పదేపదే చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఆగస్టు 15నాటికి మోరంపూడి ప్లైఓవర్ పూర్తయితే ప్రారంభోత్సవాన్ని చూడాలని ఉందని, తాను తప్పక వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీను, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మజ్జి రాంబాబు, కాతేరు టీడీపీ నాయకుడు గంగిన రంగయ్యచౌదరి (నాని) తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఇక 24 X7 వైద్యం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10: ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది 24X7 మూడు షిఫ్టుల్లో తప్పనిసరిగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రతి పీహెచ్‌సీలోని సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెలిపారు. నైట్ డ్యూటీలో రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకూ స్టాఫ్‌నర్సులకు తోడుగా నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండడంలేదనేదానిపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా సిబ్బందిపై కఠిన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల కోసం కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులకు, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండేలా, విధుల నిర్వహణకు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అందరికీ ఆదేశాలు ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



దేవరపల్లిలో పొగాకు రైతుల పురస్కార సభలో ఎంపీ పురందేశ్వరిని ఘనంగా సత్కరిస్తున్న పొగాకు రైతు సంఘం నాయకులు

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

- 13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు
- మరో ముగ్గురు శాస్త్రవేత్తలకూ పురస్కారాలు
- అందజేసి సత్కరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- దేవరపల్లిలో టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా కార్యక్రమం



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతి

వినియోగదారుల చెంతకు 2,390 మెట్రిక్ టన్నుల ఇసుక

- ఇంకా 3 లక్షల 261 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంది
- ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకే లావాదేవీలు
- జిల్లా స్థాయి కమిటీ మీటింగ్‌లో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై10: జిల్లాలోని 7 స్టాక్ పాయింట్ల ద్వారా ఈనెల 9న 2390 మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగాదారులకు చేరిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారునికి ఇసుక ఎంత ధరకు అందుబాటులో ఉందనే వివరాలు పారదర్శకంగా ప్రదర్శించే ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఏ రోజుకారోజు ఏ మేరకు స్టాకు నిల్వ ఉందో, ఎంత వినియోగం జరిగిందో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఉచిత ఇసుక పాలసీకి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.43ను అనుసరించి నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇసుక రవాణాకు ఉపయోగించే వాహనానికి సంబంధించి ఎంతమేర ఇసుక తరలిస్తున్నారో అంచనాకు వచ్చి ఆ మేరకు నిఘా వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ చేయాల్సిఉందన్నారు. నియమాలు ఉల్లంఘించే వారిపై అపరాధ రుసుం విధించాలని, ఇందుకు డీఎల్ఎస్ఏ కమిటీలోని అధికారులందరికీ అధికారం ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వాహన పరిమితికి మించి ఇసుక రవాణా చేయరాదన్నారు. ప్రతి వాహనానికి తప్పకుండా జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్టాక్‌పాయింట్లు, డిసిల్టేషన్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ పాయింట్ల ఇన్చార్జిగా వ్యవహరించే వ్యక్తులకు పూర్తి స్థాయిలో స్టాక్ వివరాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సమావేశంలో స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్ను ఇసుక రూ.270, డి-సిల్టేషన్ పాయింట్ వద్ద టన్ను ఇసుక రూ.420గా ధరను నిర్ణయిస్తూ తీర్మానించారు. ఇరిగేషన్ అధికారులు డి-సిల్టేషన్ రిజర్వాయర్లను, ట్యాంక్ బండ్స్‌ను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ సెబ్, పంచాయతీరాజ్, పోలీసులు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సమీకృత చెక్ పోస్టులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక రవాణా జరగకుండా స్టాక్ పాయింట్ల వద్ద ముందే చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఇసుక లావాదేవీలు పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ విధానం అమలు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.నరసింహులు, మైన్స్ సహాయ సంచాలకులు ఎం.సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఈఈ జి కాశీ విశ్వేశ్వరరావు, ఆర్డీవో కేవీ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డి బాలశంకరరావు, డీపీవో డి రాంబాబు, ఇరిగేషన్ డీఈ రమేష్, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన సీఈని అభినందిస్తున్న ఏపీఎన్జీవో సంఘ నాయకులు

గోదావరి డెల్టా సీఈగా పుల్లారావు బాధ్యతల స్వీకరణ

ధవళేశ్వరం, జూలై 10: గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన క్వాలిటీ చీఫ్ ఇంజనీర్ పుల్లారావును ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు కార్యాలయంలో కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాజబాబు, బి. లక్ష్మణుడు, పీఎస్ శేషకుమార్, కుమారస్వామి, వాసుదేవి. తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల పీహెచ్‌సీలో కు.ని ఆపరేషన్‌లు పున:ప్రారంభం


నల్లజర్ల పీహెచ్‌సీ వైద్య బృందం డాక్టర్ బాలును ఆహ్వానిస్తున్న దృశ్యం

నల్లజర్ల, జూలై 10 : కరోనా నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిపి వేయడంతో బాలింతలు కు.ని ఆపరేషన్‌లు చేయించుకోవడం కోసం దూర ప్రాంతాల్లో ఉన్న సీహెచ్‌సీ ఆసుపత్రులకు వ్యయ ప్రయాసలతో వెళ్లేవారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నల్లజర్ల పీహెచ్‌సీలో కు.ని ఆపరేషన్‌లు పున:ప్రారంభించేందుకు వైద్య బృందం భీమడోలుకు చెందిన రిటైర్డ్ డీఎంఅండ్‌హెచ్‌వో పిల్లి బాల ప్రకాశరావు(డాక్టర్ బాలు)ఆహ్వానించడంతో ఎటువంటి రుసుము తీసుకోకుండా స్వచ్ఛందంగా వచ్చి కు.ని ఆపరేషన్‌లు చేస్తానని హామీ ఇవ్వడంతో గురువారం కు.ని ఆపరేషన్‌లకు రంగం సిద్ధం చేశారు. నేటి నుంచి ప్రతినెలా 10మందికి కు.ని ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తానని బాలు చెప్పడంతో రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ పరిధిలోనే నల్లజర్లలోనే కు.ని అపరేషన్‌లు పున:ప్రారంభమై కొనసాగుతాయని డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ సిరాజ్, వైద్య ఉద్యోగుల సంఘం కార్యదర్శి జీ.వి.వి.ప్రసాద్ పేర్కొంటున్నారు

పశుగ్రాస సాగుకు ప్రాముఖ్యత ఇవ్వాలి

● నిడదవోలు సహాయ సంచాలకులు డాక్టర్ రుషిప్రసాద్


రైతులకు సూచనలు ఇస్తున్న సహాయ సంచాలకులు రుషి ప్రసాద్

పెరవలి, జూలై 10 : పశుగ్రాస వారోత్సవాలు సందర్భంగా పిట్టలవేమవరంలో బుధవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. నిడదవోలు సహాయ సంచాలకులు డాక్టర్ విత్తనాల రుషిప్రసాద్ పాడి రైతులకు మెరుగైన పశుగ్రాస సాగుకున్న ప్రాముఖ్యత గురించి వివరించారు. పాడి రైతులు తమకున్న భూమిలో కొంత భూమిని పశుగ్రాసాల సాగుకు కేటాయించాలని తద్వారా రైతులకు పాలదిగుబడి పెరుగుతుందన్నారు. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సల్మా, సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నరసింహరావు

పెరవలి, జూలై 10: వరి సాగులో కొద్దిపాటి మెలకువలను పాటిస్తూ శాస్త్రీయ విధానాలు ఆచరిస్తే సాగు ఖర్చు తగ్గడంతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు పేర్కొన్నారు. బుధవారం పెరవలిలో రైతు సేవా కేంద్రంవద్ద రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రధాన శాస్త్రవేత్తలు అమ్మాజి, హైమాజ్యోతి, స్థానిక వ్యవ్యవసాయాధికారి మేరీ కిరణ్, ఏఈవో మాసరమ్మ రైతులకు పలు సూచనలు చేశారు. మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా వరి నాడు మడి నుడి నాట్లు వేసుకునే దశలో ఉందని వరిలో సాధారణ రకాలకు 36 కిలోల నత్రజనం, 26 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుందన్నారు. ఈ సదస్సుకు పలువురు రైతులు పాల్గొని శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి'


కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కొవ్వూరు, జూలై 10 : రాజ్యాంగబద్ధ కార్మిక హక్కులను విస్మరించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను విరమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. బుధవారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో భవన నిర్మాణరంగ కార్మికులు, జట్టు కార్మికులు ప్లకార్డులు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుందరబాబు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సధించుకున్న హక్కులను కాలరాస్తూ, యజమానులకు అండగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దుచేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 30లక్షల మంది భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, కంటింజెంటు, పార్ట్‌టైం, గెస్ట్ తదితర ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నూతన పింఛన్ విధానాన్ని తొలగించి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. విశాఖ స్టీలు ప్లాంట్ రక్షణకు కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి దొరయ్య, మాణికిరెడ్డి హరిబాబు, నందం కొండబాబు, మద్దిపాటి హనుమంతు, మేడసాని సతీష్. చుట్టా నూకరాజు, అర్జున్ పాల్గొన్నారు.

డాక్టర్ల సూచనలు పాటిస్తే
మానసిక రుగ్మతల నుంచి కోలుకోవచ్చు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే మానసిక రుగ్మతల నుంచి బయట పడవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీని యర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రిలోని మానసిక రుగ్మతల చికిత్సా కేంద్రాన్ని ఆయన బుధవారం సంద ర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి వైద్యులు ఆయనకు వివరించారు. మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని వారి కుటుంబాలతో కలిపే చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఆయన సూచించారు. ఈ విషయంలో న్యాయ సహాయం కావాలంటే డీఎల్ఎస్ఏ చేస్తుందని చెప్పారు. రోగులతో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు వైద్యం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించవద్దని ఆదేశించారు.

నేటి నుంచి రైతుబజార్లలో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10 : జిల్లాలోని రైతు బజార్ల ద్వారా గురువారం నుంచి బియ్యం, కందిపప్పు సబ్సిడీ ధరలపై విక్రయించనున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ధరల నిర్ణయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిత్యావసర వస్తువులైన బియ్యం, కందిపప్పు ధరలు బహిరంగ మార్కెట్‌లో పెరిగిన నేపథ్యంలో వినియోగదారులకు సరసమైన ధరలకు సరుకులు అందేలాచర్యలు చేపడుతున్నామని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 10: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోలేకపోతే భవిష్యత్‌లో పేదవిద్యార్థులకు విద్యను దూరంచేసినట్టేనని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో బుధవారం వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శారీరక వ్యాయామంతోపాటు ఆటపాటలలో పాల్గొనే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. శారీరక వ్యాయామం లేని విద్యార్థులు అన్నిరంగాలో వెనుకబడి ఉండడంతో పాటు చిన్నతనం నుంచే అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలు విద్యార్థులను మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు శిక్షణ అందిస్తామన్నారు. ఆ విషయాన్ని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, షూస్, మధ్యాహ్న భోజనం అందిస్తామని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకువచ్చినట్లయితే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కొవ్వూరు ఏఎస్‌జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతిలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని టి.యశస్వినికి రూ.5వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జార్జి, ఎస్.జి.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఆర్.కె.వి. స్వామి, ఎ.వి.డి. ప్రసాదరావు, ఎస్. నాగరాజు, ఎస్. వీరబాబు, పొట్రు మురళీ, ఎంఈవోలు జె.కెంపురత్నం, కె. రామకిషోర్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవస్థలను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత

వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేను కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులు పాల్గొని అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనాటి పిల్లలు చాలా ఫాస్ట్‌గా ఉన్నారు. తల్లి తరువాత ప్రాథమిక విద్యను అందించాల్సిన బాధ్యత అంగన్వాడీలపై ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రాథమిక విద్యతోపాటు క్రమశిక్షణ, భోజనం చేయడం, పెద్దల పట్ల ఎలా నడుచుకోవాలి అని చిన్నతనం నుంచి నేర్పించాలన్నారు. ఏ సెంటరులో చూసిన 10నుంచి 15మంది పిల్లలు మాత్రమే ఉంటున్నారు. తమ పరిధిలో ప్రీస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, పిల్లలు అంతా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేటట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


ప్రీస్కూల్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి


ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రైళ్ల పునరుద్ధరణకు ప్రయత్నం చేస్తా

● ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

కొవ్వూరు, జూలై 10 : కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ కారణంగా రద్దుచేసిన రైళ్ల నిలుపుదలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వలేనని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం నుంచి దేవరపల్లి వెళుతుండగా మార్గ మధ్యలో కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణలు కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ కారణంగా రద్దుచేసిన రైళ్ళ హాల్ట్‌లను పునరుద్ధరించాలని, రోడ్డు కం రైలు బ్రిడ్జి మరమ్మతులకు గురికావడంతో కొవ్వూరు పట్టణంలోకి రాకుండా ఎక్స్‌ప్రెస్‌లు హైవే మీదుగా వెళ్లిపోతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ పట్టణంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై సాధ్యమైనంత మేరకు పరిష్కరిస్తానని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.వి.ముత్యాలరావు, తాడిమళ్ళ విజయవాణి, నీరుకొండ సూర్యనారాయణ, పిక్కి నాగేంద్ర, గెల్లా కేశవ, గంధ్రోతు పవన్, అద్దూరి సత్యనారాయణ, కొండపల్లి రత్నసాయి, జి.శివకృష్ణ, భువనేశ్వరి, జనసేన నియోజకవర్గ ఇంచార్జి టి.వి. రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక విధానంతో నిత్యం ఉపాధి'

దివాన్‌చెరువు, జూలై 10: కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుకవిధానంతో భవననిర్మాణ కార్మికులకు నిత్యం ఉపాధి లభిస్తుందని టీఎన్‌టీయూసీ జిల్లా అధికారప్రతినిధి దాసరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కొత్త విధానం బాగుందన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ దొంగ వెంకట రామకృష్ణ

చాగల్లు, జూలై 10 : స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన దొంగ వెంకట రామకృష్ణ (37) బుధవారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కూలి పనులు చేసుకుని జీవనం సాగించే దొంగ వెంకట రామకృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యతో గొడవపడి గత రెండు సంవత్సరాలుగా ఒంటరిగానే జీవనం సాగిస్తున్నాడు. న్యాయవాది సమక్షంలో ఇటీవల పరస్పర అంగీకారంతో విడాకుల పత్రాలపై సంతకాలు పెట్టినట్లు చెప్పారు. దీంతో తనకు ఎవరూ లేరనే మనోవేదనతో మనస్తాపం చెంది ఒంటరిగా ఉంటున్న ఇంటిలో స్లాబ్‌కి ఉన్న హుక్కికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి దొంగ బుల్లియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ మునసబు మృతికి పలువురు సంతాపం

ఉండ్రాజవరం, జూలై 10 : మండలంలోని దమ్మెన్ను గ్రామానికి చెందిన మాజీ మునసబు మట్టపర్తి వెంకట్రామన్న (80) మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగుళూరులో చికిత్స పొందుతూ మరణించారు. ఈ యనకు భార్య అనసూయ, కుమారుడు రామకృష్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతిపట్ల మండలంలోని ప్రజాప్రతినిధులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

'లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి'

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10 : లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని శ్యామలాసెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి, ఆశ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు అన్నామణి, ఏపీఆర్‌పీఏ కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి

● కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నినాదాలు

కొవ్వూరు, జూలై 10 : అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్. మాణిక్యాంబ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వీవోఏలు సంయుక్తంగా కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రాలు అందజేశారు. మాణిక్యాంబ మాట్లాడుతూ అంగన్వాడీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలి. 42 రోజుల సమ్మె కాలంలో మినిట్స్ కాపీలో రాసినటువంటి జీవోలను వెంటనే విడుదల చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అంగన్వాడీ హెల్పర్, వర్కర్లకు వేసవికాలంలో నెల రోజులు వేసవి సెలవులు ఇవ్వాలని, చనిపోయిన అంగన్వాడీల కుటుంబాలకు మట్టిఖర్చులు అందించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ. నరసమాంబ, ఎన్. శాంతకుమారి, సిహెచ్. బ్రహ్మమ్మ, వి. శ్రీదేవి, బి. వసంత తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

అంగన్‌వాడీల ఒప్పంద అంశాలు అమలు చేయాలి

తాళ్ళపూడి: అంగన్‌వాడీల సమ్మె ఒప్పందం ప్రకారం పలు అంశాలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు తాళ్ళపూడి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ జీవో నెం.47 మార్పుచేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలుచేయాలని, సర్వీస్‌లో ఉండగా ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంలో పాధాన్యం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులన్నీ రద్దు చేయాలని పలు అంశాలను వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సుజాత, జ్యోతి, రమణ, అవ్వమ్మ తదితర టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నల్లజర్ల: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీలు తహసీల్దార్ కృష్ణారావుకు వినతి పత్రం అందించారు. బుధవారం కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీలు వారి కోర్కెలను ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో శివకుమారి, మల్లమ్మ, రాజేశ్వరి, ఆశా వర్కర్లు లక్ష్మి, సౌదమని,మరియమ్మ పాల్గొన్నారు


నల్లజర్ల తహసీల్దార్ కృష్ణారావుకు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

పెడతోవ పడుతున్న యువత

● గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి, సారా, మత్తుపదార్థాలు
● వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

తాళ్ళపూడి, జూలై 10: యువత పెడతోవ పెట్టే విధంగా గంజాయి, సారా వంటి మత్తుపదార్థాలు విచ్చలవిడిగా గ్రామాల్లో లభ్యమవుతున్నాయని పలువురు సర్పంచులు, ఎంపీటీసీల ఆరోపణలతో సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది. తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఎంపీడీవో వెంకటరమణ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ తాళ్ళపూడి మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ సిస్టం ఏర్పాటుకు కార్యాచ రణ చేపట్టాలని కనీసం పాత డ్రైన్ వెలికి తీయిస్తే నిధులు సమకూర్చేందుకు ఆలోచన చేద్దామని తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని హాజరుకాని అధికారులకు వచ్చే సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా నోటీసులు అందించాలని ఎంపీడీవోకు తెలిపారు. ఏఈ వెంకట్రావు మాట్లాడుతతూ వర్షాకాలం కారణంగా పొలాల మీద కరెంటు వైర్లు తెగిన, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయినా వెంటనే తమ శాఖాధికారులకు తెలపాలని అన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ హరిక గుప్తా మాట్లాడుతూ డయేరియా వంటి వ్యాధులు ప్రభలకుండా ఉండడానికి తమ శాఖ చర్యలతోపాటు ప్రజలు కూడా తాగునీటి విషయంలో కలుషితంకాని విధంగా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎంపీటీసీ హరిబాబు మాట్లాడుతూ రీసర్వేలో వచ్చిన ఫిర్యాదులనున త్వరగా పరిష్క రించాలని తహసీల్దార్‌కి తెలిపారు. కాగా మండలంలో పలు గ్రామాలలో చెరువులలో, కాలువలలో గుర్రపు డెక్క పెరిగిపోయి ఈ వర్షాకాలంలో పంటపొలాలు మునిగి పోకుండా చర్యలు తీసుకోవాలని సమావేశానికి వచ్చి సమస్యలు చెప్పడమే గాని తాము అడిగే ఏ సమస్యా కూడా పరిష్కారం కావడంలేదని అవ్వడంలేదని ఆరోపించారు. సీడిపివో మమ్మి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నూతతన భవనాలకు ఎంపిపి నిధులు కేటాయించి వినియోగంలోకి తేవడానికి కృషి చేయాలని తెలిపారు. గజ్జరం ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా అంగన్‌వాడీ కేంద్రం, చర్చి సమీపంలో బహిరంగంగా అమ్ముతున్నారని వీరిలో చాలా మందిని అరెస్టుచేసి జైలుకి పంపినా తిరిగివచ్చి మళ్లీ అదే వ్యాపారం చేస్తూన్నారని వారిపై పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని తెలిపారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ పోసిన శ్రీలేఖ, తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడాటి కనకం, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీసీ జొన్నకూటి పోసిరాజు

కొవ్వాడ కాలువ పూడిక తీయించాలి

● ఎమ్మెల్యేను కోరిన రైతులు, బీజేపీ నాయకులు


ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసిన బీజేపీ నాయకులు, రైతులు

కొవ్వూరు, జూలై 10: కొవ్వాడ కాలువ పూడికలు తీయించకపోవడంతో రైతులు పంట నష్టానికి గురవుతున్నారు. కాలువలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో రైతులు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నీరు ముందుకు పారక, పంట పొలాలను ముంచెత్తుతుంది. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో అన్నదాతలకు పంట నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. కాలువలో పెరిగిపోయిన గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించాలని, కాలువపై ఆక్రమణలకుగురైన అడ్డుకట్టలను తొలగించి, కాలువను పూర్తిస్థాయిలో పూడికలు తీయించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కొవ్వాడకాలువలో గుర్రపుడెక్కను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని బుధవారం బీజేపీ నాయకులు, రైతులు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావను కోరారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కొవ్వాడకాలవ పొంగి రైతులు పంట నష్టపోతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ముప్పిడి వెంకటేశ్వరరావు స్పందిస్తూ కొవ్వాడకాలవలో గుర్రపుడెక్క తొలగించడానికి ప్రతిపాధనలు సిద్ధం చేయించామని, త్వరలో పనులు చేపడతారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీజేపీ నాయకులు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, మడిచర్ల రామచంద్రరావు, రైతులు తిరుమలశెట్టి కృష్ణ, నామా రంగనాయకులు, కొండేపాటి సత్యనారాయణ, నామా అర్జునరావు, రాయుడు, బత్తుల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఔరంగాబాద్‌లో పూడికతీత పనుల పరిశీలన

కొవ్వూరు, జూలై 10 : కొవ్వూరు పట్టణంలోని 16 వార్డులో మేజర్‌డ్రైను పూడిక పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి పరిశీలించారు. బుధవారం ఔరంగాబాద్, వేములూరు మధ్యలో మేజర్‌డ్రైను పూడిక పనులు ప్రారంబించారు. ఛైర్‌పర్సన్ రత్నకుమారి పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఛైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ ఔరంగాబాద్ కాలనీవాసులు వుంతరోడ్డులో కాలువ పూడిపోయి దోమలు పెరిగిపోయాయని, అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, మురుగునీరు పారకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, కౌన్సిలర్ కండెల్లి రామారావులు ఫిర్యాదు చేశారన్నారు. వర్షాకాలం కావడంతో ఎటువంటి అంటువ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యగా రూ.20వేలు వెచ్చించి 8గంటల పాటు ప్రైవేటు ఎక్స్‌కవేటర్‌తో మురుగుకాలువ పూడికతీత పనులు చేపట్టామన్నారు. కౌన్సిలర్ కండెల్లి రామారావు, ఏఈ దుర్గాకిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నిడదవోలు, జూలై 10: నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 11న గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


ఉండ్రాజవరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 10 : ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా బుధవారం గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. నిపుణులైన ప్రైవేటు వైద్యురాలిచే వైద్య ఉచిత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 28 మంది గర్భిణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి మాట్లాడుతూ ప్రధానమంత్రి శిశుసంరక్షణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఉచితం పరీక్షలు, మందులు, తగు సూచనలు ఇచ్చామన్నారు. పీహెచ్‌సీలలో ప్రసవించే తల్లులకు జననీ సురక్ష యోజన పథకం కింద రూ.100లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ ఎన్ కెడిఎల్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రవైద్య శిబిరం

దేవరపల్లి, జూలై 10: షిరిడిసాయిబాబా ఆలయంవద్ద భగవాన్ శ్రీసత్యసాయిబాబా సేవాసమితి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీసత్యసాయి బాబా 100వ జయంతి నిర్వహించారు. యాదగిరి పరమహంస యోగానందా నేత్రాలయం వైద్యుల పర్యవేక్షణలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 140మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 10మందికి ఆపరేషన్లు అవసరమని, 30మందికి కళ్లజోళ్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణన ఫేజ్ 2 శిక్షణా కార్యక్రమం

తాళ్ళపూడి, జూలై 10: తాళ్ళపూడి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ గణన ఫేజ్ 2 శిక్షణా కార్యక్రమం తహసీల్దార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ఉప గణాంకాధికారి సోమరాజు విచ్చేశారు. శిక్షణా కార్యక్రమంలో సోమరాజు మాట్లాడుతూ వీఆర్వోలు అందరూ ఎంపికైన గ్రామాలలో రెండవ దశ వ్యవసాయ గణన చేయాలని రైతు, పంటల సమాచారం ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. ఏఎస్‌వో జోడాల మా ట్లాడుతూ అవసరమైన డేటాను అందిస్తానని 2021-22 బేస్ ఇయర్‌గా డేటా పూర్తి చేయాలని ఈ డేటా మొత్తం ఆగస్టు 31లోపు పూర్తి చేసి తప్పుల సవరణ కూడా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏ సీతారామరాజు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పనిఒత్తిడి తగ్గించి స్కేల్ కల్పించండి

నల్లజర్ల, జూలై 10 : సచివాలయంలో పని వత్తిడి తగ్గించి డిపార్ట్‌మెంట్‌లో మంచి స్కేల్ కల్పించాలని నియోజక వర్గ డిజిటల్ అసిస్టెంట్స్ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు వినతి పత్రం అందించారు. బుధవారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో మండలం నుంచి ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్స్‌లు వచ్చి ఆయన కలిసి తమ ఇబ్బందులను తెలియజేశారు. ఈకార్యక్రమంలో షేక్ అంజాద్ ఆలీ, కేరాజశేఖర్, దానేశ్వరరావు,రజిని పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలి



చాగల్లు, జూలై 10 : ప్లాస్టిక్ నిషేదానికి అందరూ సహకరించాలని కోరుతూ బుధవారం మండలంలోని మల్లవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకం నిషేదానికి సహకరించాలని ఉపసర్పంచ్ కోడూరి కాశిగంగాధరరావు కోరారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.